

వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

చవితికి అనుమతులు తప్పనిసరి

అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్/ సిటీ, ఆగస్టు 27 : జిల్లాలో గణపతి నవరాత్రి ఉత్సవాలకు అనుమతులు సింగిల్ విండో ద్వారా ఇస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన వినాయక చవితి ఉత్సవాల అనుమతులు,ముందస్తు చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వినాయక చవితి పండుగను అత్యంత జాగ్రత్తగా నిర్వహించే క్రమంలో మునిసిపల్,మండల స్థాయిలో అనుబంధ శాఖలతో ఈ నెల 30వ తేదీలోగా సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు సిద్ధం చేయాలని తెలిపారు. అధికారుల కమిటీ ఏర్పాటు చేసుకుని ఏ రోజు వచ్చిన దరఖాస్తులపై ఆ రోజే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిబంధనలు మేరకు అనుమతి ఇవ్వాలన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలోని విగ్రహాలను కొవ్వూరు అధికారులు పేర్కొన్న ప్రాంతాల్లోనే నిమజ్జనం చేపట్టాలన్నారు.ఉత్సవాల నిర్వాహకులు సహకరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పంచాయతీ అధికారి తగిన భద్రత చర్యల పర్యవేక్షణ చేపట్టాల్సి ఉందన్నారు. ఎస్పీ నరసింహకిశోర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అందరు సహకరించాలని కోరారు. డీఎస్పీలు వ్యక్తిగత పర్యవేక్షణ ద్వారా రూట్ మ్యాప్ సిద్ధం చేసి వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జేసీ చిన్న రాముడు, డీఆర్వో జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ఎత్తు 5 అడుగులే ఉండాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో సాధారణ జన జీవనానికి ఇబ్బంది కలగకుండా అల్లర్లకు అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే ఆయా ఉత్సవ కమిటీ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలను వివరిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రహం ఎత్తు 5 అడుగులకు మించి ఉండకూడదని తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి కార్యక్రమాలకూ అనుమతి లేదు. హుండీలు, విలువైన వస్తువులు ఉన్న చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బలవంతంగా చందాలు వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.నిమజ్జనానికి తగు అనుమతి తీసుకోవాలని తెలిపారు.



గోదాట్లో.. డ్రెడ్జింగా!?

ఆ బోట్లు ఎందుకొచ్చాయ్..



రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో మంగళవారం ప్రత్యక్షమైన డ్రెడ్జింగ్ బోట్లు

- అనుమతుల్లేకుండా డ్రెడ్జింగ్ బోట్లు
- గామన్ బ్రిడ్జి సమీపంలో ట్రయల్స్
- అటూ ఇటూ తిరగడంతో అనుమానాలు
- ర్యాంపుల్లో బాటలు.. జేసీబీలు రెడీ
- ఇంకనూ పర్యావరణ అనుమతుల్లేవ్
- జిల్లాలో తీవ్రంగా ఇసుక కొరత
- నిలిచిపోయిన భవన నిర్మాణాలు
- ఇసుక సరఫరాపై అధికారుల దృష్టి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అధికారులు చెబుతున్నది ఒకటి.. క్షేత్రస్థాయిలో జరుగుతున్నది మరొకటి..గోదావరిలో ఇసుక తవ్వకాలకు ఇంకా పర్యావరణ అనుమతులే రాలేదు.. అయితే మంగళవారం గోదావరిలో డ్రెడ్జింగ్ బోట్లు తిరగడం చర్చనీయాంశమైంది. ఇవి ఎక్కడ నుంచి వచ్చాయ్.. అనుమతుల్లేకుండా ఎలా తిరుగుతున్నాయ్.. ఎందుకు తిరుగుతున్నాయ్.. అనే అనుమానాలు తలెత్తాయి.ఒక పక్క అధికారులు ఉచిత ఇసుక సరఫరాపై మల్లగుల్లాలు పడుతుంటే ఇంకో పక్క డ్రెడ్జింగ్ బోట్లు తిరగడం పలు విమర్శలకు తావిచ్చింది. గోదావరి వరదల నేపథ్యంలో ప్రస్తుతం ఇసుక సరఫరా నిలిపివేశారు. దీంతో జిల్లాలో ఇసుక కొరత విపరీతంగా ఉంది. ఐదు యూనిట్ల ఇసుక రూ. 23 వేల వరకు ధర పలుకుతుందంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉచిత ఇసుక అంటూ అందుబాటులోకి తేవడంతో భవన నిర్మాణదారులంతా ఆనందపడ్డారు. అంతలోనే వరదలు రావడంతో ఇసుక కొరత వచ్చి ఆందోళన చెందుతున్నారు.ఈ నెల 10వ తేదీకి ముందే ఇంటి నిర్మాణాలకు ముహూర్తాలు పెట్టుకుని ఇసుక లేక చాలా మంది నిర్మాణాలు ఆపేసి కూర్చున్నారు. జిల్లాలో ఇసుక ర్యాంపులకు ఎపుడు అనుమతి ఇస్తారో .. ఇసుక ఎప్పుడు వస్తుందోనని భవన నిర్మాణదా రులకు ఎదురుచూపులు తప్పడంలేదు.

డ్రెడ్జింగ్ బోట్లు ఎలా వచ్చాయ్..

గామన్ బ్రిడ్జి సమీపంలోని కాతేరు ర్యాంపుల్లో డ్రెడ్జర్లు బోట్లు మంగళవారం ట్రయల్స్ వేయడం చర్చనీయాంశమైంది. పైగా కాతేరు నుంచి వెంకటనగర్ వరకూ అన్ని ర్యాంపుల్లో డ్రెడ్జింగ్ బోట్లు ప్రత్యక్షమయ్యాయి.మరో ప్రక్క ర్యాంపుల బాటలను జేసీబీలతో శుభ్రం చేస్తున్నారు. ఈ ర్యాంపులకు కొంత దూరంలోని హైవే ప్రక్కన వ్యవసాయ కళాశాల సమీపంలో గతంలో ఇసుక స్టాక్ పాయింట్ ఉండే ప్రాంతాన్ని చదును చేశారు. డ్రెడ్జింగ్ బోట్లు బ్రిడ్జి కింద నుంచి అటూ ఇటూ నడుపుతూ హడావిడి చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ డ్రెడ్జింగ్‌కు అనుమతి ఇస్తారే మోననే ప్రచారం జరుగుతోంది.మరో పక్క జిల్లా లోని ర్యాంపులు మూతపడి ఉన్నాయి. ఓపెన్ ర్యాంపులు ప్రారంభమయ్యే వరకూ ఇసుక కొరత లేకుండా అఖండ గోదావరిలో డీసిల్టేషన్ పేరిట ఇసుక తీయడానికి 9 ర్యాంపులు గుర్తించారు. వాటికి కొన్ని అనుమతులు రావలసి ఉంది. ఇరిగేషన్ ఆధ్వర్యంలో ర్యాంపుల్లో బోట్స్‌మన్ సొసైటీల ద్వారా ఇసుక తీయడానికి టెండర్లు పిలవాలని భావించారు.ఇంకా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు రాలేదు.దీంతో ఆలస్యం అవుతోంది. ఇదిలా ఉండగా ఇక టెండర్లు పిలవకుండానే బోట్స్‌మన్ సొసైటీల ద్వారా ఇసుక తీసే ఆలోచన కూడా అధికారులు చేస్తున్నట్టు సమాచారం. ఇది వాస్తవ రూపం దాల్చకపోతే వచ్చే నెల 11వ తేదీ వరకూ ఇసుక లేనట్టే. కానీ ఈలోపు ఇసుక సమస్యను పరిష్కరించాలనే ఆలోచనతో అధికారులు ఉన్నారు. గామన్ బ్రిడ్జికి అవతల వైపు కాతేరు నుంచి సీతానగరం వైపు మైన్స్ అధికారుల ఆధ్వర్యంలో అనుమతులు రానున్నాయి. ప్రస్తుతం ఏవిధమైన అనుమతులు లేవని అధికారులు చెబుతుంటే..కాతేరు ర్యాంపుల్లో డ్రెడ్జింగ్ పడవల సందడి అనుమానాలు తావిస్తోంది.

ఇసుక రవాణా వాహనాలకు జేసీ అనుమతి తప్పనిసరి : కలెక్టర్

ఉచిత ఇసుక కోసం రీచ్‌లకు వచ్చే వాహనాలకు స్లాట్ కేటాయింపు చేసి ట్రక్కు షీట్ జారీ చేయవలసి ఉందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టం చేశారు.కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె జేసీ చినరాముడు, డీఆర్వో జి.నరసింహులుతో కలసి డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఇసుక రవాణా వాహనాలకు జేసీ అనుమతి తీసుకోవాలని, ఆయన జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి మాత్రమే బుకింగ్ పాయింట్ వద్దకు అనుమతించి ట్రిక్ షీట్ జారీ చేయాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో ఎటువంటి అవకతవకలు లేకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు. ఇక పెండింగ్‌లో ఉన్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీలు 492లో 490 పరిశీలించినట్టు చెప్పారు. హౌసింగ్ ప్రాజెక్టు పీడీ వద్ద ఒకటి, బిక్కవోలు మండల సర్వేయర్ వద్ద ఒకటి పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు.

పోలీస్ స్టేషన్లలో అక్రమ ఇసుక ఏం చేస్తారు?



పెరవలి స్టేషన్‌లో ఉన్న ఇసుక

పెరవలి, ఆగస్టు 27 : ఇసుక ఎక్కడున్నా బంగారమాయే.. ప్రస్తుతం గోదావరికి వరదలు వస్తున్నందు వల్ల ఇసుక తీయడం కుదరదు. అందువల్ల ఎక్కడ గుట్టలు ఉన్నా దానికి అమిత డిమాండ్ ఉంటుంది. ఇటీ వల ప్రభుత్వం స్టాక్ పాయింట్ల నుంచి ఇస్తున్న ఇసుకను ఆగమేఘాలపై తీసుకుపోయారు. డిమా ండ్‌కు తగ్గ సరఫరా కూడా చేయలేక రెండు రోజులు వేచి ఉంటేనే గాని ఒక్క లారీ కూడా ఎగుమతి కాని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఎక్కడ అక్రమ నిల్వలు ఉన్నా వాటిని వెలికి తీయాల్సి బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉంది. పెరవలి పోలీసు స్టేషన్ పరిధిలో గత ఐదారేళ్లలో అక్రమ ంగా పట్టుకున్న ఇసుకను ఇరిగేషన్ స్థలంలో నిల్వ ఉంచారు. అయితే అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ ఇసుక గుట్ట నిండా పిచ్చి మొక్కలు మొలిచిపోయాయి.అక్కడ ఇసుక ఎంత ఉందో కూడా తెలియని పిరిస్థతి. అక్రమంగా తీసుకువెళుతున్న ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి అదే ఆవరణలో ఉంచగా అది కూడా తుప్పు పట్టి ఇసుకలో కలిసిపోయింది.ఈ పరిస్థితుల్లో ఆ ఇసుకను వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఈ దిశగా పోలీస్ రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ప్రస్తుతం ఇసుక కొరతగా ఉండడం వల్ల దానిని వేలం వేయాలని కోరుతున్నారు.దీనిపై ఎస్ఐ అప్పారావును ప్రశ్నించగా ఇసుక విషయ మై ఉన్నతాధికారులకు నివేదించా..త్వరలోనే వేలం వేయడానికి రంగం చేస్తారని పేర్కొన్నారు.



కండువా.. మార్చేయ్!

వైసీపీ నాయకుల యూటర్న్

- నాడు వైసీపీ ప్రజాప్రతినిధులతో చెట్టాపట్టాల్
- నేడు కూటమి నేతల వద్దకు చేరుతున్న వైనం
- షాడోలుగా మారి చక్రం తిప్పుతున్నారు..
- బదిలీల్లోనూ వారిదే పైమాట..
- ఎన్నికల్లో కష్టపడిన నేతల కినుక

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 27 : రాజకీయాల్లో శాశ్వత మిత్రులు ఉండరు.. శాశ్వత శత్రువులు ఉండరు.. ఇది జనమెరిగిన సత్యమే.. ప్రస్తుతం కూటమి నేతలు ఇదేం నిజం చేస్తున్నారు.. నాడు వైసీపీ అధికారంలో ఉండగా కాలరెగరేసిన నేతలు ప్రస్తుతం కాలరుదించేసి కూటమి కింద చేరుతున్నారు. పరాయి వారిని పంచన చేర్చుకోవడంతో అసలు నేతలకు రుచించడం లేదు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు వెంట తిరుగుతూ వ్యవహారాలు చక్కబెట్టి చక్రం తిప్పిన అజ్ఞాతవాసులు ఇప్పుడు యూ టర్న్ తీసుకున్నారు.ఉద్యోగుల బదిలీలు మొదలుకొని కాంట్రాక్టులు, అక్రమ నిర్మాణాలు, అక్రమ మైనింగ్, భూదందాలు చేసేవారంతా బ్యాక్ డోర్ గుండా కూటమి నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు.షాడోలుగా మారి పైరవీలు చేస్తున్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున జరుగుతున్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియలోనూ వారే చక్రం తిప్పుతున్నారు.పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, మునిసిపాలిటీ తదితర శాఖల్లో వారిదే పైచేయిగా ఉంది. కలెక్టరేట్ రెవెన్యూ విభాగంలో ఒకరు వారి శాఖలో ఉద్యోగులు బదిలీల విషయంలో బాగా సహకరిస్తూ ప్రజాప్రతినిధులు సిఫార్సులను తూచా తప్పక అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కూడా ఈ అధికారి చక్రం తిప్పారు. డిమాండ్ ఉన్న పోస్టులకు షాడోలు రేటు పెట్టేశారు.వారికి అధికారులు సహకరిస్తున్నారు. ఎందుకంటే ఆయా ప్రాంతాల్లో పోస్టులకు ఉన్న డిమాండ్‌ను బట్టి ధర నిర్ణ యిస్తున్నారు. పంచాయతీల విషయానికి వస్తే రూరల్ మండలం హుక్కుంపేట పంచాయతీ కార్యదర్శిగా వేమగిరి కార్యదర్శిని సిఫార్సు చేసినట్టు తెలిసింది.ఇదే ఉద్యోగి సీతానగరం మండలం రఘుదేవపురం పంచా యతీలో నిధుల దుర్వినియోగం అభియోగంపై షోకాజ్ నోటీసు అందుకున్నారు. సదరు ఉద్యోగి ప్రస్తుతం వేమగిరిలో పనిచేస్తుండగా అక్కడా అభి యోగాలు ఉన్నాయి.కోలమూరులో గతంలో పనిచేసిన కార్యదర్శి అప్పట్లో భారీమొత్తంలో పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. అదే కార్యదర్శిని మళ్లీ కోలమూరుకు సిఫార్స్ చేసినట్టు తెలిసింది. రాజానగరం మండలం పాలచర్ల పంచాయతీలో ఇద్దరికి ఎమ్మెల్యే సిఫార్స్ లేఖలు ఇవ్వడం తాంబూళం ఇచ్చాం తన్నుకు చావండి అన్నట్టుగా ఉంది. ఇలా అనేక బదిలీలు జరుగుతున్నాయి. ఇక రెవెన్యూలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నిబంధలనకు తూట్లు పొడుస్తున్నారు. సాధారణంగా ఒక చోట ఐదేళ్లు నిండిన ప్రతి ఉద్యోగిని బదిలీ చేయాలనే నిబంధన ఉంది. అయితే అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో (పరిపాలన సౌలభ్యం) కోసం అంటూ నచ్చిన వారికి, సొమ్ములు ఎక్కువ ఇచ్చిన వారిని బదిలీ చేసేందుకు శ్రీకా రం చుట్టారు.బదిలీలకే లక్షలు ఖర్చుచేసుకుని సీటు నిర్ధారించుకున్న అధికారులు,ఉద్యోగులు వాటిని రికవరీ చేసుకోవడానికే చూస్తారు.. ప్రజలకేం ఉపయోగపడతారు. అందువల్ల ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే పరిస్థి తి ఉండదనేది అందరికి తెలిసిన విషయమే. ఇదంతా చూస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు నోరెళ్లబెడుతున్నారు. తామంతా కష్టపడి కూటమిని అధికారంలోకి తీసుకొస్తే షాడోలు చక్రం తిప్పడంపై మండిపడుతున్నారు.

నైతిక విలువలకు తిలోదకాలు..

పూర్వం ఉద్యోగి నడవడిక, వృత్తిలో అంకితభావం, ప్రజలకు సర్వీసు చేయాలనే తపన ఉన్న ఉద్యోగులను ఏరికోరి రప్పించే పరిస్థితులు ఉండేవి. మారిన రాజకీయాల నేపథ్యంలో పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. నాయకులు బదిలీలను ఆదాయ వనరుగా చూడడంతో అన్నీ పక్కదారి పటేశాయి. అధికారి ఉద్యోగుల ట్రాక్ రికార్డుతో పనిలేకుండా క్యాష్‌తో గుర్తిం పు ఇవ్వడం సమాజంలో నైతిక విలువలకు తిలోదకాలు ఇవ్వడమే. గత ప్రభుత్వం చేసిన తప్పులను ప్రక్షాళన చేయాలంటే ప్రభుత్వ శాఖల్లో అవి నీతి అక్రమాలను రూపుమాపాలి.ఉద్యోగుల ట్రాక్ రికార్డును పరిశీలించి నిర్ణ యం తీసుకోవాలని పలువురు సీనియర్ నాయకులు ,సీనియర్ సిటిజన్ల వాదన.

'దుబాయ్‌లో తెలుగు భాషా దినోత్సవాలు'

రాజమహేంద్రవరం కల్చరల్,ఆగస్టు 27 :తెలుగు భాషా వికాసానికి దోహదపడుతూ..దుబాయ్‌లో ఐదు రోజుల పాటు తెలుగుభాషా ఉత్సవాలు జరగబోతున్నాయని వ్యవహారిక భాషా ఉద్యమకారుడు,గిడుగు రామ్మూర్తి మునిమనుమరాలు,గిడుగు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గిడుగు కాంతి కృష్ణ వెల్లడించారు.దుబాయ్ తెలుగు సంఘం నిర్వహించే ఈ ఉత్సవాల్లో గిడుడు స్మరణతో పాటు, తెలుగు భాషావేత్తల స్మరణ జరుగుతుందని తెలిపారు. సీపీ బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిదానం శాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో మంగళవారం గిడుగు తైల వర్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం గిడుగు కాంతి కృష్ణను సత్కరించారు.కార్యక్రమంలో రాకా రమణ, వైచిట్టిబాబు,ముంగండ సూర్యనారాయణ, నల్లగొండ రవి ప్రకాష్ పాల్గొన్నారు.



సొమ్ములిప్పించు.. అప్పులు శ్రీనివాసుడా!

- ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు పలువురు చేబదులు
- ఐదు నెలలైనా సొమ్ములు రాక ఆవేదన
- ఓటమి పాలవడంతో మాట దాటవేత
- సొమ్ములు రాబట్టుకునేందుకు మల్లగుల్లాలు

నిడదవోలు,ఆగస్టు 27 : ఎంత ఖర్చయినా పరవాలేదు.. నేను గెలవాలంతే.. అప్పు చేసి అయినా ఖర్చుపెట్టండి.. గత సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ కింద కూర్చుని ఆ పార్టీ నేతలు చెప్పిన మాట ఇది.. జిల్లావ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలంతా తమ నాయకుడి కోసం కోట్ల రూపాయలు చేబదులుగా ఇచ్చారు. ఆ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఓటరు అడిగింది లేదనకుండా.. ఉద్యోగులు కోరింది కాదనుకుండా ఇచ్చేశారు.. తీరా ఎన్నికలైన తరువాత చూస్తే.. ఓటరు తీర్పు మారింది. కూటమికే పట్టం కట్టారు. కోట్లతో ఓట్లు కొందామని చూసినా వైసీపీ నాయకులకు కో అంటే కోట్లుపోయాయి.. పోనీ గెలుపు అయినా వచ్చిందా అంటే అదీలేదు. అంతే చేబదులు ఇచ్చిన నాయకుల ఫోన్‌లు ఎత్తడం కూడా మానేశారు.ఒక వేళ ఫోన్ ఎత్తినా నేడు రేపు అంటూ వాయిదా మీదా వాయిదా వేస్తుండడంతో చేబదులు ఇచ్చిన నేతలంతా ఆందోళన చెందుతున్నారు. ఓటమి పాలైన ఆ నాయకులు నియోజకవర్గానికి అడపా దడపా వచ్చినా డబ్బు ఇచ్చిన వారు ప్రశ్నిస్తే వాయిదాపై వాయిదా వేస్తూ పక్క రాష్ట్రానికి వెళ్లిపోతున్నారు. కొంత మంది నాయకులైతే అసలు బయటకే రావడంలేదు.గత ఐదేళ్లు జనంలో తిరిగినవారంతా నేడు ఇళ్లకే పరిమితమయ్యారు. గట్టిగా అడిగితే ఇచ్చిన డబ్బులు కూడా వస్తాయో రావో అని నిలదీసేందుకు సైతం డబ్బు ఇచ్చిన వారు వెనుకంజ వేస్తున్నారు.ఇదిలా ఉంటే జిల్లాలోని ఒక నియోజకవర్గంలో ఆ నాయకుడి పరిధిలోని పట్టణ ప్రథమ పౌరుడు సైతం బహిరంగంగా విలేకరుల సమావేశాన్ని పెట్టి ఆ నాయకుడికి తనకు మధ్య అంతరంగిక వ్యవహారాలు ఉన్నాయని చెప్పడం గమనార్హం.వారిద్దరి మధ్య ఉన్న అంతరంగిక వ్యవహారాలు సార్వత్రిక ఎన్నికల్లో సర్దుబాటు చేసిన రూ.1.40 కోట్లు అంటూ కొందరు గుసగుసలాడుకుంటున్నారు.ఈ ఒక్కరి నుంచే కాకుండా ఆ నియోజకవర్గంలో వైసీపీ నేతల నుంచి ఆ నాయకుడు కోట్ల రూపాయలు చేబదులుగా తీసుకున్నట్టు వినికిడి. ఆ నాయకుడు ఓటమి పాలు కావడంతో కోట్లాది రూపాయలు చేబ దులు ఇచ్చిన నేతలంగా ఇప్పుడు ఎలా వసూలు చేసుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌గా ఆ నాయకుడిని మార్చి కొత్తవారిని నియ మించకపోతే పార్టీ కార్యకర్తలంతా పార్టీని వీడే అవకాశం ఉందంటూ సొంత పార్టీ నేతలే పక్క చూపులు చూస్తున్నారు. ఎన్నికల ముందు వరకు ఆ నాయకుడి అడుగులో అడుగు వేసిన కొందరు కౌన్సిల్ సభ్యులు సైతం అధికారం కోల్పోగానే అసలు స్వరం వినిపించారు. పలువురు కౌన్సిల్ సభ్యులు జనసేనతో జతకట్టేందుకు సై అనగా మరికొందరు తమ రాజ కీయ భవిష్యత్తుపై వ్యూహరచన చేస్తున్నారు.పార్టీ కేంద్ర కార్యాలయం నియోజకవర్గానికి మరొకరిని ఇన్‌చార్జిగా నియమిస్తే పార్టీకి తిరిగి పూర్వ వైభవం వస్తుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు అంటున్నారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు నియోజకవర్గాల్లో నూ ఇదే పరిస్తితి ఉంది. చేబదులు ఇచ్చిన నాయకులు కక్కలేక మింగలేక ఉన్నారు. ఏదో ఒక విధంగా తమ సొమ్ము రాబట్టుకునేందుకు చూస్తున్నారు. అయితే వైసీపీ నాయకులు మాత్రం ఎన్నికల్లో అంతా ఖర్చయిపోయిందని మాటదాట వేస్తూ పబ్బం గడుపుతున్నారు. ఎన్నికలు పూర్తయి ఐదు నెలల అవుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.నాయకులకు పెద్ద మొత్తంలో సొమ్ములు చేబదులు ఇచ్చిన వైసీపీ నేతలంతా ఓ శ్రీనివాసుడా మాపై దయచూపించమనవయా అంటూ ఆ వడ్డికాసులవాడిని వేడుకుంటున్నారు.కూటమి నేతల వద్ద పంచాయితీలు పెడుతున్నారు.జిల్లా రాజకీయ వర్గాల్లో ఇది హాట్ టాపిక్‌గా మారింది.



రైల్వే ప్రయాణికులకు భద్రతేది!

- తొలగని గ్రహణం.. తెరుచుకోని రైల్వే ఆటో బూత్
- ప్రయాణికుల భద్రతపై కానరాని శ్రద్ధ
- రాత్రివేళ ఒంటరి మహిళలకు తప్పనితిప్పలు
- ఎంపీ పురందేశ్వరి కల్పించుకోవాలని వినతులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికుల భద్రతపై అలసత్వానికి రెడ్ సిగ్నల్ పడడం లేదు. రైల్వే స్టేషన్‌లో రక్షణ మాట అటుంచితే..అర్ధరాత్రి వేళ రైలు దిగి రోడ్డుపైకి వస్తే ఇంటికి చేరతామన్న నమ్మకం కొరవడింది. మొన్న కోల్‌కతాలో ఓ వైద్యురాలిపై దారుణం..నిన్న అసోంలో ఓ విద్యార్థినిపై అఘాయిత్యం పాఠాలు నేర్పినట్టు కానరావడం లేదు. ఏదోక ఘోరం జరిగితే.. ఆ కుటుంబం శోకంలో మునిగిపోతే అప్పుడు చర్యలు చేపడతామనే తీరు విస్మయానికి గురి చేస్తోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో రైల్వే స్టేషన్లో దిగుతున్న మహిళలు, వృద్ధులు, పిల్లలు తెల్లారేవరకూ స్టేషన్లోనే ఉండే పరిస్థితి ఉంది. శివారు ప్రాంతాలకు వెళ్లడానికి పురుషులు సైతం ధైర్యం చేయలేకపోతున్నారు. ఈ దుస్థితిని గమనించి ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన రైల్వే ప్రీ పెయిడ్ ఆటో బూత్ నాలుగేళ్లుగా నిద్దరోతోంది. ఇప్పటికే ఎన్ఎస్‌జీ-2 హోదా కలిగిన స్టేషనులో కీలకమైన ఆటో బూత్‌ని తుడిచి మరుస్తుండడాన్ని అభద్రత వెక్కిరిస్తోంది.రైల్వే స్టేషన్ సమీపంలో పలుమార్లు అసాంఘిక వ్యక్తుల వద్ద గంజాయి పట్టుబడినా.. ముందస్తు జాగ్రత్తలు ఇంకా కళ్లు తెరవకపోవడం గమనార్హం.

నాడు టీడీపీ హయాంలో..

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017 మార్చి 29న రైల్వే స్టేషనులో ఆటో ప్రీపెయిట్ బూత్‌ని ఏర్పాటు చేశారు. దీనికి అప్పటి ఎస్పీ బి.రాజ కుమారి ప్రత్యేక చొరవ చూపారు. ఇది మనుగడలో ఉన్నంత కాలం ప్రయాణికుల భద్రతకు ఇబ్బంది ఉండేది కాదు. బూత్‌లో 24/7 సేవలు అందించేవారు. రైల్వే స్టేషను నుంచి ఎక్కువ గా రా క పో క లు సాగించే ప్రాంతాలు, శివారు ప్రదేశాలకు ధరలు నిర్ణయించిన బోర్డు ఉండేది.ప్రయాణికులు ఏ సమయంలో వచ్చి కోరినా పోలీసులు వారి పేరు వివరాలు నమోదు చేసుకొని,ఆటో డ్రైవరు ఫోన్ నంబరు తీసుకొని సీరి యల్ విధానంలో పంపించడం జరిగేది. దీంతో ఒంటరి మహిళలు సైతం రాత్రి సమయాల్లో ఏ భయమూ లేకుండా ఇంటికి చేరేవారు.


ఎంపీ కల్పించుకోవాలి..

రైల్వే స్టేషన్లో భద్రతకు ప్రభుత్వ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం ఉంటాయి. స్టేషను దాటి బయటకు వస్తే మాత్రం టూటౌన్ పోలీసులు భద్రత కల్పించాల్సి ఉంటుంది. ప్రతి రోజూ సరాసరి ఈ రైల్వే స్టేషను గుండా 36 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. రాజమండ్రి రైల్వే స్టేషనుకు పగటి కంటే రాత్రి వేళల్లోనే ఎక్కువగా రైళ్లు వస్తుంటాయి. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణికుల ఇక్కడి నుంచి ఇంటికి చేరుకోడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇంటి వద్ద నుంచి ఎవరైనా వస్తే వెళ్లడం లేదా ఉదయం వరకూ స్టేషన్లోనే ఉండిపోవడం చేస్తున్నారు. ప్రస్తుతం ఎంపీ పురందేశ్వరి రైల్వేస్టేషను అభివృద్ధిపై దృష్టి సారించారు. దీనిలో భాగంగానే భద్రతకు సంబంధించిన ఆటో ప్రీపెయిడ్ బూత్‌ని దారిలో పెట్టాలని ప్రయాణికులు ఎంపీని కోరుతున్నారు.

ఎందరు ఎస్పీలు మారినా..

కరోనా సమయంలో ఆటోబూత్‌ని తాత్కాలికంగా మూసేశారు. నాటి నుంచీ ఈ బూత్‌కి పట్టిన గ్రహణం వీడడం లేదు. ఎందరు ఎస్పీలు మారినా రైల్వే ప్రయాణికులు రైల్వే స్టేషను దాటి బయటకు వచ్చిన తర్వాత భద్రత ప్రశ్నార్థకంగానే ఉంది. ఏడాది క్రితం హడావుడిగా శుభ్రం చేసి వదిలేశారు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో మళ్లీ ఈ ఏడాది జూన్ 9న అదే హడావుడిని రిపీట్ చేశారు. ఎందుకనో మళ్లీ భద్రతను గాలికి వదిలేశారు.బూత్‌లోని కంపూటర్లు,ప్రింటర్లు, ఫర్నీచరు ఏమయ్యాయో తెలియదు. అప్పట్లో సౌత్ జోన్ పరిధిలో ఈ బూత్ నిరంతరంగా సేవలందించేది.ప్రస్తుతానికి కరెంటు మీటరు ఒక్కటే ఇప్పటికీ పని చేస్తూ యంత్రాంగం చిత్తశుద్ధిని హేళన చేస్తోంది. మళ్లీ ఈ బూత్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వాడపాలెం కుర్రోడే



మన ఆశయం పెద్దగా ఉండాలంటే ఆలోచనలు గొప్పగా ఉండాలి... అటువంటి ఆలోచనల నుంచి పుట్టిందే నా కవిత్వం.... అయితే దానికి ఆదర్శం ఈ సమాజం. సమాజం అంటే సహజ గుణంగా భావించే నేను అందులోని జనులతో సహా పలు జీవరాశులను పరిగణలోకి తీసుకుని పరిశీలించి నా కంటూ ఒక నడవడిక ఏర్పరచుకున్నాను. ఆ నడవడికే 27 ఏళ్లకే ఆరు పుస్తకాలు రాసేలా చేసింది.... 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాకు మాటల రచయితగా అవకాశం దక్కేలా చేసింది.

...కొండల్‌రావు



డైలాగ్ రైటర్

కొత్తపేట, ఆగస్టు 27: మెగా ప్రిన్సెస్ నిహారిక కొణిదల నిర్మాతగా ఈ నెల 9న విడుదలై బ్లాక్ బాస్టర్ హిట్ అయిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం డైలాగ్ రైటర్ కోనసీమ కుర్రోడే. అతడే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెం మునసబు గారి వీధికి చెందిన అడ్డగళ్ళ ఆంజనేయులు మనుమడు కొండల్‌రావు. హిస్టరీలో పీజీ చేసిన ఇతడు రచనల పట్ల ఆసక్తితో ఇప్పటి వరకు ఆరు కథలు రచించాడు. 'కమిటీ కుర్రోళ్లు' సినిమా డైరెక్టర్ వంశీ... కొండలరావును సంప్రదించగా కథకు ఊపిరిపోస్తూ మాటలు అందించాడు. ఈ సినిమా బ్లాక్ బాస్టర్ కావడంతో కొండల్ రావుకు అవకాశాలు రావడం మొదలు పెట్టాయి. మెగాస్టార్ చిరంజీవి, నాగబాబు, తనికెళ్ల భరణి, యండమూరి వీరేంద్రనాథ్, చంద్రబోస్ వంటి వారు కొండల్‌రావును పిలిచి అభినందించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కూడా అతడిని దుశ్శాలువాతో సత్కరించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని దీవించారు. ఈ సందర్భంగా కొండల్‌రావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మంచి కథలతో చలనచిత్ర రంగంలో గుర్తింపు తెచ్చుకోవాలన్నదే తన అభిలాష అని చెప్పాడు.



కొండల్ రావ్ రచనలు



మెగాస్టార్ చిరంజీవితో...



← రచయిత విజయేంద్రప్రసాద్‌తో...



ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నుంచి సత్కారం అందుకుంటున్న కొండల్ రావు (ఫైన)

30న రత్నగిరిపై ఉచిత సామూహిక

వరలక్ష్మీ వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 27: శ్రావణ మాస ఆఖరు శుక్రవారం సందర్భంగా రత్నగిరిపై ఈ నెల 30న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఆరోజు ఉదయం 8 గంటలకు కొండపైకి చేరుకోవాలన్నారు. కొబ్బరికాయ, అరటిపళ్లు, పువ్వులను భక్తులు తీసుకొస్తే మిగిలిన ద్రవ్యాలు, వరలక్ష్మి రూపు, జాకెట్టుముక్క, గాజులు, ప్రసాదం దేవస్థానం అందజేస్తుందని పీఆర్వో కృష్ణారావు చెప్పారు.

1న అన్నవరంలో బాల్ బ్యాడ్మింటన్

జిల్లా జట్ల ఎంపిక

అన్నవరం, ఆగస్టు 27: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ బాల, బాలికల జట్ల ఎంపికలను అన్నవరంలో నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు ముప్పన వీర్రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నవరం లోని సత్యదేవ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే ఎంపిక లకు 2009 జనవరి 2 తర్వాత పుట్టినవారు అర్హులు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, డ్రెస్‌కోడ్‌తో రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 99499 59951, 80082 66003 నంబర్లలో సంప్రదించాలి.

ఎన్‌సీసీ కమాండింగ్

అధికారిగా ప్రవీణ్‌బాబు



జేఎన్టీయూకే, ఆగస్టు 27: ఎన్‌సీసీ కాకినాడ యూనిట్ కమాండింగ్ అధికారిగా పి.ప్రవీణ్ బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2000 జనవరి 1న ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌బాబు మాట్లాడుతూ యువత ఎన్‌సీసీలో చేరేందుకు ఆసక్తి చూపాలని, కాకినాడ యువ క్యాడెట్లల్లో క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తిని పెంపొందించడంలో కృషి చే స్తానన్నారు. అనంతరం వింగ్ కమాండర్ డీఎస్ఎన్ మూర్తి 9ఎయిర్ కమాండింగ్ అధికారి బాధ్యతలు అప్పగిస్తూ 9ఎయిర్ ఎన్‌సీసీతో తన అనుభవాన్ని తెలిపారు.

లోకో పైలట్‌కు 'జీఎం మ్యాన్ ఆఫ్ ది మంత్'

సేఫ్టీ అవార్డు

రాజమహేంద్రవరం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్‌లో గూడ్స్ లోకో పైలెట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.శంకర్రావు మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ నుంచి 'జీఎం మ్యాన్ ఆఫ్ ది మంత్' సేఫ్టీ అవార్డు అందుకున్నారు. తేలప్రోలు-పెద అవుటపల్లి సెక్షన్‌లో డ్యూటీలో ఉన్న శంకర్రావు రైలు వెళ్తుండగా 457/11-9 వద్ద పెద్ద కుదుపు రావడం గమనించి వెంటనే ట్రాక్ తనిఖీ చేశారు. పట్టాల మధ్య వెల్డింగ్ వదిలేసినట్టు గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేశారు. ప్రమాదం తప్పడంతో ఆయన్ను అవార్డుకు ఎంపిక చేశారు. శంకర్రావును డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్, డివిజనల్, స్థానిక అధికారులు అభినందించారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి...

కొబ్బరి రైతుల సమస్యలు

» భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీ మోహన్ మిశ్రా » ఈదరపల్లిలో పలు రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం » 2026ను కొబ్బరి సంవత్సరంగా ప్రకటించాలని డిమాండ్

అమలాపురం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీ మోహన్‌మిశ్రా పేర్కొన్నారు. గతంలో మాదిరిగా కొబ్బరిని లాభసాటి పంటగా మార్చే దిశగా రైతుల్లో తీసుకురావాల్సిన మార్పులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ ఈదరపల్లిలోని జనహిత కార్యాలయంలో మంగళవారం ఒడిసా, కేరళ, తమిళనాడు, కర్ణాటక, గోవా, బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తొలుత భరతమాత, బలరామకృష్ణుడు చిత్రపటాలకు పూజ చేశారు. జాతీయ కన్వీనర్ సుందర్‌రాజన్ జ్యోతి ప్రకాశనం చేయగా బీకేఎస్ పతాకాన్ని మిశ్రా ఆవిష్కరించారు. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వెంకటరాఘవులు అధ్యక్షతన సదస్సును ప్రారంభించారు. పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధుల సూచనలను పరిగణలోకి తీసుకుని వాటిని తీర్మానాలుగా రూపొందించారు. అఖిల భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి, కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం, అడ్డాల గోపాలకృష్ణ, జిన్నూరి బాబి, గోదశి నాగేశ్వరరావు, కొప్పూరి త్రినాథరెడ్డి అనేక అంశాలను వివరించారు. కొబ్బరి ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు, మార్కెటింగ్ సౌకర్యాలను పెంపొందించేందుకు 2026ను కొబ్బరి సంవత్సరంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. తీర్మానాలను తిక్కిరెడ్డి గోపాలకృష్ణ చదివి వినిపంచారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, ఆర్వీ నాయుడు, మాకిరెడ్డి సత్తిబాబు, అప్పారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్ మిశ్రా

నేడు అమలాపురంలో జాతీయ కొబ్బరి రైతుల సదస్సు

భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో బుధవారం అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్టు జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, బీకేఎస్ జాతీయ స్థాయి నాయకులు పాల్గొంటారు.

తీర్మానాలివీ...

- రైతులకు మేలు చేసేలా కొబ్బరి బోడకాయ కిలో ధరరూ.45గా నిర్ణయించి ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయాలి.
- కొబ్బరి దింపు సమస్య తీవ్రంగా ఉన్నందున ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీని ఉపయోగించి హార్వెస్టింగ్ చేసే యంత్రాలు తయారుచేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేయాలి.
- మహిళా సంఘాలకు కొబ్బరి ఉప ఉత్పత్తులపై తర్ఫీదు ఇచ్చి మార్కెటింగ్ కల్పించేలా రాయితీలు అందించాలి.
- కొబ్బరి వినియోగం పెంచేందుకు అభివృద్ధి బోర్డు చర్యలు తీసుకోవాలి.
- కొబ్బరిలో ఇరియోఫిడ్ నల్లి తెగులుతో పాటు పలు తెగుళ్లను సామూహికంగా అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- కొబ్బరిలో దిగుబడులను పెంచడానికి మట్టి నమూనాలు పరీక్షించి మైక్రో న్యూట్రియంట్ ఎరువుల విధానం తక్కువ ఖర్చుతో అందించే విధంగా ఏర్పాటు చేయాలి.
- కొబ్బరినూనెలో కల్తీగా వాడే పారాఫిన్ ఆయిల్ కెర్నాయిల్‌పై నియంత్రణ ఉండడంతో పాటు అవసరమైతే కోనసీమలో కెర్నాయిల్ వినియోగాన్ని నిషేధించాలి.
- కొబ్బరి బోర్డు ద్వారా ఆర్‌అండ్‌ఆర్ స్కీమ్, రీప్లాంటేషన్‌లో రాష్ట్రంలో ఎక్కువ విస్తీర్ణంలో అమలయ్యేలా ప్రోత్సహించాలి.
- ప్యాక్ హౌస్ స్కీమును కొద్ది మార్పులతో రైతులకు కొబ్బరిని కురిడిగా తయారు చేసుకునేందుకు బాల్‌కోప్రా హౌస్ పేరుతో ఎక్కువ రాయితీపై అందించాలి.



చోరీ జరిగిన ఇంట్లో క్లూస్ టీం తనిఖీలు, సీఐల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ దేవకుమార్

బంగారం వ్యాపారి ఇంట్లో భారీ చోరీ

» కొవ్వూరు ఉషశ్రీ అపార్ట్‌మెంట్‌లో ఘటన » 50 కాసుల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ » దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

కొవ్వూరు, ఆగస్టు 27: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో బంగారం వ్యాపారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. యజమానులు నిద్రిస్తుండగానే ఈ ఘటన జరగడం సంచలనం కలిగించింది. పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు వీధిలో నివాసముంటున్న ఉషశ్రీ జ్యూయలర్స్ యజమాని కట్టా ఉషశ్రీ అపార్ట్‌మెంట్లో దొంగలు పడ్డారు. మంగళవారం తెల్లవారుజామున 3-4గంటల మధ్యలో దుండగులు వెనుక ఇంటి పైనుంచి ఉషశ్రీ ఇంట్లోకి ప్రవేశించారు. బెడ్రూమ్‌లో అందరూ నిద్రపోతుండగా వారి పక్కనే ఉన్న అల్మారా, బీరువాల్లో ఉంచిన 50 కాసుల బంగారు వస్తువులు, రూ.2 లక్షల నగదు, సెల్‌ఫోన్ అపహరించారు. వాటితో వెళ్లిపోతూ అపార్ట్‌మెంట్ కింద పార్కింగ్‌లో ఉంచిన యాక్టివా స్కూటర్‌నూ దొంగిలించుకుపోయారు. ఇంటి యజమాని నిద్ర నుంచి లేచిచూడగా అల్మారా, బీరువాలు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ జి.దేవకుమార్, పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, పట్టణ ఎస్ఐ కె.జగన్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రప్పించి వేలిముద్రలు సేకరించారు. చుట్టు పక్కల ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. ఉషశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. దీంతో పాటు మరో రెండు ఇళ్లలో చోరీకి యత్నించి విఫలమైనట్టు ఆ ఇళ్ల యజమానులు పోలీసులకు సమాచారం అందించారు.



బీరువా తలుపులు తెరిచి వున్న దృశ్యం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కలుషిత ఆహారం తిని

» గురుకుల పాఠశాల విద్యార్థినులు 72 మందికి అస్వస్థత
» ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స
» ఆసుపత్రి, వసతిగృహాలను సందర్శించిన కలెక్టర్ షాన్ మోహన్ ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం, ఆగస్టు 27: కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు 72 మంది మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పిలతో బాధపడుతున్న వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాత్రి వసతిగృహంలో విద్యార్థినులకు మెనూలోలేని గోంగూర, వంకాయతో కూడిన కూర వడ్డించారు. కలుషిత ఆహారం వల్ల విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్టు ప్రాథమికంగా వైద్యులు గుర్తించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ షాన్‌మోహన్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆసుపత్రితో పాటు గురుకులాన్ని సందర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అస్వస్థతకు గల కారణాలను తెలుసుకునేందుకు విచారణ జరిపిస్తామని కలెక్టర్ తెలిపారు. నీరు కలుషితం కాలేదని, ఆదివారం రాత్రి తీసుకున్న ఆహార పదార్థాల వల్లే అస్వస్థతకు గురైనట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు వైద్య సేవలు అందించాలని మండల వైద్యాధికారిణి శైలజను ఆదేశించారు. పర్యటనలో తహసీల్దారు ఆర్వీ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి నరసింహ నాయక్, డీసీహెచ్ఎస్ స్వప్న, ప్రిన్సిపాల్ చంద్ర శారద, జనసేన ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, ఎంఈవోలు బి.అబ్బాయి, వరలక్ష్మి ఆసుపత్రిలో విద్యార్థులను చూసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రాణాపాయం లేదు: ఎస్.స్వప్న, డీసీహెచ్ఎస్



గురుకుల పాఠశాల విద్యార్థినులు అస్వస్థతకు లోనైన మాట వాస్తవమే. వారికి ప్రాణాపాయం లేదు. కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలతో సత్వర వైద్య సేవలు అందించాము. బాలికలంతా క్షేమంగానే ఉన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.



విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



వసతిగృహంలో ఆయాతో మాట్లాడుతున్న కలెకర్ షాన్ మోహన్

అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదానికి

ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు

ధ్రువపత్రాన్ని ఆవిష్కరించిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్

జేఎన్టీయూకే, ఆగస్టు 27: అన్నవరం సత్యనారాయణస్వామి ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపునిస్తూ జారీ చేసిన ధ్రువపత్రాన్ని మంగళవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ధ్రువపత్రాలు జారీ చేసేలా తగిన చర్యలు చేపట్టాలని జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణకు సూచించారు. కాకినాడ ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఏపీలో ఎన్ఏబీఎల్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ గుర్తింపుతో కూడిన ప్రయోగశాల జేఎన్టీయూకేలోని ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీ ఒకటేనన్నారు. ఈ ధ్రువీకరణ పత్రాన్ని దేవస్థానం ఈవోకు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.రమేష్, అక్నూ అనుబంధ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహ్మద్ హబీబ్ బాషా పాల్గొన్నారు.

బావ మరిదిపై కత్తితో బావ దాడి

తీవ్ర గాయాలు.. కాకినాడ జీజీహెచ్‌కు తరలింపు



అనపర్తి, ఆగస్టు 27: మండలంలోని రామవరంలో బావ మరిదిపై బావ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీనునాయక్, బాధితుడి బంధువుల వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన తాతపూడి విజయ్‌కుమార్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన వీరమ్మతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం రామవరంలో జరిగే ఒక వేడుకలో పాల్గొనేందుకు, చెల్లిని చూసేందుకు వీరమ్మ అన్నయ్య ఖండవిల్లి ఆనంద్ మంగళవారం సాయంత్రం వచ్చాడు. ఈ సందర్భంగా ఇంట్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను ఆనంద్ ప్రస్తావించడంతో బావ, బావమరిది మధ్య వివాదం తలెత్తింది. కోపోద్రిక్తుడైన విజయ్‌కుమార్.. ఆనంద్‌ను కత్తితో తలపై నరకడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే బంధువులు అతడిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆనంద్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు దుర్మరణం



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ భానుప్రసాద్

ఐ.పోలవరం, ఆగస్టు 27: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గాదిరాజు రాజంరాజు (65) మంగళవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. మురమళ్లలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తున్న సమయంలో కొత్త మురమళ్ల వద్ద వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఐ.పోలవరం ఎస్ఐ భానుప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాజంరాజు మృతదేహాన్ని ఎమ్మెల్యే బుచ్చిబాబు చూసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టీడీపీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రాజంరాజు మృతితో కేశనకుర్రులో విషాదఛాయలు అలుముకున్నాయి. సర్పంచ్ బీర సత్యకుమారి, సీహెచ్ సుబ్బరాజు, మాజీ ఎంపీపీ ఇందుకూరి పద్మకేశవరామరాజు, గాదిరాజు రామకృష్ణంరాజు, జంపన వాసురాజు, ముదునూరి లింగరాజు, చిక్కం రాంబాబు, కడియం తమ్మయ్య, సలాది శేషారావు విచారం వ్యక్తం చేశారు.

విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి

ఏలేశ్వరం, ఆగస్టు 27: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురంలో ఒక వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన సగరపు సత్యనారాయణ (34) మంగళవారం పొలంలో పామాయిల్ గెలలు కోసి ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలో చేతిలో వున్న కత్తి విద్యుత్ తీగకు తగిలి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో

పిఠాపురానికి ప్రథమస్థానం

పిఠాపురం, ఆగస్టు 27: లెర్నర్స్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పిఠాపురం జట్టు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనపర్తిలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. ఇందులో పిఠాపురం, అనపర్తి, రాజమహేంద్రవరం జట్లు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. విజేతగా నిలిచిన పిఠాపురం జట్టు క్రీడాకారులను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు అభినందించారు.



ప్రథమ స్థానంలో నిలిచిన పిఠాపురం జట్టు

ఏజెన్సీ సమాచారం



ఎమ్మెల్యే శిరీషదేవి దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న ప్రజలు

సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా: ఎమ్మెల్యే

రాజవొమ్మంగి, ఆగస్టు 27: ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మంగళవారం లబ్బర్తిలో ఎమ్మెల్యే శిరీషదేవి, ఆమె భర్త, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు విజయభాస్కర్‌లను గ్రామస్తులు సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మండలంలో రెండు రోజులు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. లబ్బర్తి మరిడమ్మ, కిర్రాబు దుర్గమ్మ ఆలయాలను ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లబ్బర్తిలో టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించారు. అనంతరం రాజవొమ్మంగిలో ఉపాధి హామీ ప్రజా వేదిక జరుగుతున్న తీరును పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమై ప్రజా సమస్యలు త్వరితగిన పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. టీడీపీ అరకు పార్లమెంటు ఉపాధ్యక్షుడు దంతులూరి శివరామచంద్రరాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, జనసేన మండల శాఖ అధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు తాము సూరిబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణజాల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా ప్రజా వేదిక

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

రాజవొమ్మంగి, ఆగస్టు 27: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక సభను అధికారులు మంగళవారం నిర్వహించారు. ఇది మూకీ డ్రామాలా ఉందని హాజరైన ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్ల రూపాయల పనులపై ఆడిట్ చేసి ప్రజా వేదికలో బాధ్యులకు జరిమానా విధించడం, ఉద్యోగులపై చర్యలు తీసుకునే సమయంలో అధికారులు వారికి వారే మాట్లాడుకుంటే బహిరంగ సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. పీడీ శివయ్య జోక్యం చేసుకుని... వినిపించకపోతే ముందు వరుసలో కూర్చోవాలని కోరారు. ఆ సమాధానం సభలో చర్చనీయాంశమైంది. ప్రజా వేదిక సభ కేవలం ఆరు గంటల్లోనే ముగియడం ఆశ్చర్యంగా ఉందన్నారు. విరామ సమయం బాగా ఎక్కువ ఉండడంతో ఫిర్యాదుదారులు వెనుదిరిగినా కొందరు పీడీ దృష్టికి తీసుకెళ్లారు. విరామ సమయం సుమారు మూడు గంటలు ఉండడంతో ప్రజలు వెనుదిరిగి సభా ప్రాంగణంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. దీనిపై పీడీ శివయ్యను ప్రశ్నించగా.... కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ఉండడం వల్ల ఆలస్యమైందన్నారు. కాగా ప్రజా వేదిక సభను ఎమ్మెల్యే శిరీషదేవి పరిశీలించారు. పీడీ శివయ్యతో మాట్లడుతూ సిబ్బంది గత ప్రభుత్వంలో మాదిరిగా అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించరాదని, చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో అవకతవకలకు పాల్పడిన వారి తీరు మారాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి పనిలోనూ పారదర్శకత అవసరమన్నారు.

రూ.29లక్షల అవకతవకలు గుర్తింపు

మండలంలో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు మండలంలో వివిధ పనులకు సుమారు రూ.20 కోట్లు విడుదల కాగా అధికారులు అవకతవకలను గుర్తించారు. ఎంపీడీవో యాదగిరేశ్వరావును వివరణ కోరగా... సుమారు రూ.29లక్షల తేడాలు గుర్తించామన్నారు. బుధవారం పూర్తి వివరాలు అందజేస్తామన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థిని అనారోగ్యంతో మృతి

చింతూరు, ఆగస్టు 27: మండంలోని ఎర్రంపేట కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థి శ్యామల లక్ష్మీపార్వతి (13) భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో సోమవారం రాత్రి మృతి చెం దింది. చింతూరు మండలం మామిళ్ళగూడేనికి చెందిన పార్వతి కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతోంది. లక్ష్మీపార్వతి ఆరోగ్యం బాగోలేదని అదే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జీవనజ్యోతి శనివారం రాత్రి ఫోన్ చేసి చెప్పింది. దీంతో రాములమ్మ ఆదివారం ఉదయం పాఠశాలకు వెళ్ళింది. అప్పటికే పార్వతి నీరసంగా కనిపించింది. దీంతో ఇంటికి తీసుకెళ్లేందుకు అనుమతి కావాలని ఉపాధ్యాయులను కోరగా పరీక్షలు ఉన్నాయంటూ నిరాకరించారు. దీంతో రాములమ్మ సమీపంలోని చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి లక్ష్మీపార్వతిని తీసుకెళ్ళింది. అక్కడి వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని... మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించాలని సూచించారు. కాగా రాములమ్మ ముందుగా కూతురిని ఇంటికి తీసుకొచ్చింది. పరిస్థితి జఠిలంగా ఉండటంతో తన కూతురిని తిరిగి సాయంత్రం చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళింది. మరోసారి లక్ష్మీపార్వతిని పరీక్షించి భద్రాచలం రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మంగళవారం మృతదేహాన్ని మామిళ్ళగూడెంలోని సొంత ఇంటికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రాములమ్మ మాట్లాడుతూ.... ఉపాధ్యాయులు ముందుగా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్టయితే తన కూతురు బతికేదని, కేవలం ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే తాను తన కూతురిని పోగొట్టుకున్నానని బోరున ఏడ్చింది.

రాములమ్మ భర్త వీర్రాజు వరదల సమయంలో తీవ్ర అవస్థతకు గురై మృతి చెందాడు. ఇప్పుడు కూతురు కూడా మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది, ఈ విషయమై కస్తూర్బాగాంధీ పాఠశాల ప్రత్యేక అధికారిని రమాదేవిని ఆంధ్రజ్యోతి వివరణ కోరింది. లక్ష్మీపార్వతి ఆరోగ్యం పట్ల తాము ఎటువంటి నిర్లక్ష్యం వహించలేదని, సోమవారం భద్రాచలం కూడా వెళ్లి ప్రైవేట్‌గా పరీక్షలు చేయించారని చెప్పారు.

సీఆర్టీలను రెన్యువల్ చేయాలి

రంపచోడవరం, ఆగస్టు 27: రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల్లో పదేళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్‌టీ)ల్లో కొంతమందిని రెన్యువల్ చేసి మరికొందరిని ఆపడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్ పేర్కొన్నారు. ఏజెన్సీ 11 మండలాల్లో ఉన్న 323 మంది సీఆర్టీలను రెన్యువల్ చేయని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు. సీఆర్టీల సమస్యను విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తున్న సీఆర్టీలను మంగళవారం సాయంత్రం ఆమె కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ పీవో సింహాచలాన్ని కలిసి చర్చించారు. నిబంధనల ప్రకారమే తాను వ్యవహరిస్తానని ఐటీ డీఏ పీవో ఎమ్మెల్యేకు వివరించారు.

పాఠశాలకు టెంట్, టార్పాలిన్ బహూకరణ

వర రామచంద్రాపురం, అగస్టు 27: వీఆర్ పురం జిల్లా పరిషత్ పాఠశాల 2000-01 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు బొర్ర నరేష్‌కుమార్, ముత్యాల సిద్ధు, బొర్ర ఆదినారాయణ, బొర్ర సూరి, కోట్ల అప్పాజి, సంతోష్ టార్పాలిన్, టెంట్‌లను మంగళవారం అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాబూరావు, పీఎంసీ చైర్మన్ శంకరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

మోతుగూడెం, ఆగస్టు 27: మోతుగూడెం పరిధిలో జ్వరాలపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చిన విషయం తెలిసిందే. దీంతో వైద్య శాఖ డివిజన్ అధికారులు వెంటనే స్పందించి అయా గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరాలతో ఉన్న వారి నుంచి రక్తన మూనాలు సేకరించారు. జ్వరాలతో ఉన్న వారిని గుర్తించి మోతుగూడెం, తులసిపాక పీహెచ్‌సీల్లో వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రి నూతన భవనం పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. జిల్లా మలేరియా నియంత్రణ అధికారులు, సిబ్బంది దోమల నివారణ మందు ఫాగింగ్ చేసి ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్నారు.

రైతులు విధిగా పంట నమోదు చేసుకోవాలి

దేవీపట్నం, ఆగస్టు 27: రైతులందరూ విధిగా పంట నమోదు చేసుకోవాలని దేవీపట్నం ఏవో ఆర్‌ప్రశాంతి కోరారు. ఇప్పటివరకు 2,100 ఎకరాలకు మాత్రమే పంట నమోదు చేసుకున్నారన్నారు. సెప్టెంబరు 15లోపు మిగతా వారంతా నమోదు చేయించుకోవాలన్నారు. ఇందుకూరుపేటలో పంట నమోదును ప్రశాంతి పర్యవేక్షించారు. ఏఈవో రత్నాకుమార్, రైతులు పాల్గొన్నారు.

31న మెగా రక్తదాన శిబిరం

రాజానగరం, ఆగస్టు 31: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ 31న రాజానగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్లో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఆరోజు ఉదయం 10గటలకు ప్రారంభించనున్న ఈ శిబిరానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

50వ డివిజన్ పర్యటనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 27: డివిజన్లలో సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 50వ డివిజన్ పరిధి భాస్కరనగర్, సుబ్రహ్మణ్యనగర్, చౌడేశ్వరి నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. డ్రైనేజీలు, రహదారులను పరిశీలించారు. అవసరమైన చోట్లలో డ్రైనేజీలు, రోడ్లు, కల్వర్టులు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ గత పాలకులు కమీషన్లకు ప్రాధాన్యమిచ్చారని.. తాము అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ప్రాముఖ్యత ఇస్తున్నామన్నారు. డివిజన్ శివారు ప్రాంతంలో కొంతమంది ఆకతాయిలు రాత్రివేళల్లో గంజాయి తాగి ఇబ్బంది పెడుతున్నారని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించి రాత్రి గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, మరుకుర్తి రవియాదవ్, బుడ్డిగ రాధ, హరిబెనర్జి, నగరపాలక సంస్థ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



50వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

బ్యాడ్మింటన్ క్రీడాకారులకు అభినందన

విజయవాడలో ఇటీవల జరిగిన యంగ్ స్టార్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024లో విజేతలుగా నిలిచిన బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఎమ్మెల్యే వాసు అభినందించారు. తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఉదయం అండర్-9, 11, 13, 15, 17, 19 విభాగాల్లో విజయం సాధించిన క్రీడాకారులు వారి సాధించిన ట్రోఫీలతో ఎమ్మెల్యేను కలిశారు. ఈ మేరకు క్రీడాకారులను, కోచ్ విజయన్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

'నరసన్న' భూములపై నిషేధాన్ని తొలగించాలి



దేవదాయశాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

దేవదాయ శాఖా మంత్రి ఆనంకి ఎమ్మెల్యే బత్తుల వినతి

రాజానగరం/కోరుకొండ, ఆగస్టు 27: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలో వివిధ శాఖల మంత్రులను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా వినతిపత్రాలు అందజేశారు. దీనిలో భాగంగా దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లను కలిసి 22(ఎ) (1)(సి) రిజిస్ట్రేషన్ చట్టం నుంచి కోరు కొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూములపై ఉన్న నిషేధ ఉత్తర్వు లను తొలగించాలని కోరారు. అలాగే రంగనాథస్వామి ఆలయ రాజగోపురం పునర్నిర్మాణం, నరసింహస్వామి ఆలయాభివృద్ధి, టీటీడీ నూతన కల్యాణ మండపం మంజూరు, శ్రీవాణి ఆలయాల చెల్లింపుల వివరాలు, రానున్న పుష్కరాలకు టెంపుల్ టూరిజం డెవలప్‌మెంట్‌పై చర్చించారు. కణుపూరు కొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి, శివపార్వతుల విగ్రహం ఏర్పాటుపై చర్చించి త్వరగా పూర్తి చేయాలని కోరారు.

అలాగే హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి సీతానగరం మండలం మునికూడలి, బొబ్బిలంక, పురుషోత్తపట్నంలో గోదావరి ఎడమ వరద ఒడ్డు తరచూ కోతకు గురవుతోందని, నిధులు మంజూరు చేసి అంచును పటిష్ట పర్చాలని కోరారు. బొబ్బిల్లంక-పురుషోత్తపట్నంలోని ఏజీఎల్‌బీ బండ్‌పై బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కోరుకొండ, ఆగస్టు 27: కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయ ముఖ మండపంలో అర్చకస్వాములు, అధ్యాపకులు, వేద పండితుల మంత్రోచ్చరణలతో రుక్మిణి సమేత శ్రీకృష్ణభగవానుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరంస్వామి వారికి ప్రత్యేక సేవాకాలం జరిపారు. అలాగే హరేరామ సమాజ ఆవరణలో ఆలయార్చకులు, హరేరామ భజన భక్త సమాజం ఆధ్వర్యంలోను, బజారులోని ఆర్యవైశ్య కోదండ రామాలయం వద్ద ఆలయార్చకుల ఆధ్వర్యంలోను శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. విశేష పూజలు చేశారు. అనంతరం ఉట్ల ఉత్సవం జరిగింది. 21 రకాల పిండి వంటలతో స్వామివారికి ప్రత్యేక నివేదనలు చేశారు. కాగా నరసింహస్వామి దేవస్థానం ఎదుట బుధవారం సాయంత్రం 6.30గంటలకు ఉట్టి కొట్టే మహోత్సవం జరుగుతుందని ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్, అన్నవరం దేవస్థానం అధికారులు తెలిపారు.



కోరుకొండలో పూజలు

అనపర్తి: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్థానిక శేషగిరిరావుపేట సాయిరామ్ మందిర్‌లో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ద్వారంపూడి వెంకటరామకృష్ణారెడ్డి శ్రీవాణి దంపతులు పూజలు చేపట్టారు. అనంతరం శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. ఆలయ కమిటీ సభ్యులు పడాల కళ్యాణ్‌రెడ్డి, చింతా ప్రకాశ్‌రెడ్డితోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బిక్కవోలు: భక్తులు సమర్పించిన స్వీట్లు

బిక్కవోలు: బిక్కవోలులోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటు చేసి అర్చకులు రాఘవరామ్ ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్థులు వివిధ రకాల స్వీట్లు, పిండి వంటలు కానుకగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి

వంద రోజుల ప్రణాళిక

నిర్మాణ ప్రక్రియలో స్తబ్దత కుదరదు.. సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 27: రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల ప్రణాళిక ద్వారా గృహ నిర్మాణం పనులు చేపట్టి వేగవంతంగా చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో పీఏవై- గృహనిర్మాణ పనులపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ గృహనిర్మాణ లక్ష్య సాధనలో నిర్ణాయక పాత్ర, సరైన ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పనులు చేపట్టాలని, విధి నిర్వహణలో స్తబ్ధతగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. మీరు నిర్దేశించుకున్న హౌసింగ్ పనులకు ఉపాధి హామీ పనిదినాలను అనుసంధానం చేసే దిశగా ఏపీవోలతో సమావేశం నిర్వహించడం, జాబ్‌కార్డు లేని వారికి వాటిని కల్పించడంపై చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద పని దినాల కల్పన ఆ రోజులకు వేతనం, మెటీరియల్ కంపోనెంట్ కింద ముడిసరుకు, అదనపు రుణ సౌకర్యం కల్పించడం జరగాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో హౌసింగ్ నిర్మాణం కోసం అదనపు రుణసౌకర్యం కల్పించడం జరగాలన్నారు. ప్రభుత్వ హౌసింగ్ లేఅవుట్ స్థానిక సంస్థలు ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందుకు సంబంధించి పట్టణ, గ్రామీణ పరిధిలోకి వచ్చే స్థానిక సంస్థల అధికారులపై చర్యలు తీసుకోవడం తప్పని సరి అన్నారు. లేఅవుట్‌లలో ఇళ్లు నిర్మించిన లబ్ధిదారులకు రేషన్‌కార్డు మార్పు, విద్యుత్ కనెక్షన్, తాగునీటి సరఫరా తదితర సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో కేఆర్‌ఆర్‌సీఎస్‌డీసీ/ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ ఆర్.కృష్ణనాయక్, డీఆర్‌డీఏ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి, డీపీవో డి.రాంబాబు, హౌసింగ్ ఈఈలు జి.పరశురామ్, సూరిబాబు, డీఎల్డీవో పి.వీణాదేవి, డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగలత తదితరులు పాల్గొన్నారు.

కళా గౌతమి వార్షికోత్సవం



రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 27: అమ్మ భాషను బతికించుకుందాం, అమ్మను కాపాడుకుందాం అని గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ అధ్యక్షురాలు గిడుగు కాంతికృష్ణ అన్నారు. కళా గౌతమి సాహిత్య సంస్థ 33 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తాడితోట సంహిత కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన వేడుకలకు హాజరై మాట్లాడారు. గిడుగు రామూర్తి పంతులు తెలుగుభాష ఉన్నతికి చేసిన నిర్విరామ కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి యువతను జాగృతం చేయాలన్నారు. శివకుమార్ రాసిన ప్రియమైన గిడుగు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కాంతికృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో జక్కంపూడి విజయలక్ష్మి, సేవారత్న లోలభట్టు శ్రీనివాసరాజు, ఫైర్ బీఎఫ్.శ్రీహరి, అవధాని తాత సత్యసందీప్, నాట్యాచార్యుడు సప్పా దుర్గాప్రసాద్, బీహెచ్‌వీ రమాదేవి, ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జయమణికి జాతీయ సేవా పురస్కారం




జయమణిని సేవా పురస్కారంతో సత్కరిస్తున్న మదర్ థెరిస్సా సొసైటీ ప్రతినిధులు

రంగంపేట, ఆగస్టు 27: రంగంపేట పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కటికతల జయమణిని మదర్ థెరిస్సా సొసైటీ బీఆర్ అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కారంతో సత్కరించింది. ఈ మేరకు ఆమె స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని ఈ అవార్డులకు ఎంపిక చేసి మంగళవారం విజయవాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కారం సత్కరించారని, పురస్కారంలో పొందిన వారిలో తాను కూడా ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జయమణిని పలువురు అభినందించారు.

వినాయక చవితి వేడుకలకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

రంగంపేట, ఆగస్టు 27: వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో పబ్లిక్ ప్రదేశాలలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు పంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ తోట కృష్ణసాయి మంగళవారం తెలిపారు. నవరాత్రులకు గణేష్ ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, విగ్రహాల ఎత్తు ఐదడుగులకు మించరాదని, ప్రజలు ఎవ్వరూ ఇబ్బంది పడకుండా సౌండ్ పెట్టాలని, రాత్రి 10 గంటల తరువాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. విద్యుత్ కనెక్షన్‌కు ఆశాఖాధికారుల అనుమతులు పొందాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో అల్లర్లకు, ఘర్షణలకు తావివ్వకుండా గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఎస్ఐ చెప్పారు.

కూటమి నాయకుల మొక్కు చెల్లింపు



తిరుమలలో మొక్కు చెల్లించుకున్న కూటమి నాయకులు

బిక్కవోలు, ఆగస్టు 27: అనపర్తి ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గెలుపొందితే తిరుపతి వేంకటేశ్వరస్వామికి తలనీలాలు సమర్పించుకున్నామని పందలపాకకు చెందిన కూటమి నాయకులు మొక్కుకున్నారు. దీంతో వారు మంగళవారం తిరుమల వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పడాల వెంకటరామారెడ్డి, గుణ్ణం శ్రీనివాసచౌదరి, సబ్బెళ్ల విజయభాస్కరరెడ్డి, సబ్బారపు సూర్యనారాయణ, అనుసూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాకు మరింత ప్రోత్సాహమివ్వాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 27 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాకు మరింత ప్రోత్సాహం అందజేయాలని ప్రజలందరికీ యోగాపై ఆసక్తి కలిగించి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహకరించాలని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ఏపీ పేపర్‌మిల్లు ఎదురుగా ఉన్న కృష్ణసాయి కల్యాణ మండపంలో మంగళవారం జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఈస్ట్‌గోదావరి ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో కోచ్ గరిమెళ్ల రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1నుంచి రెవెన్యూ సదస్సులు

కోరుకొండ, ఆగస్టు 27: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 1నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో భూ వివాదాలపై ప్రతి గ్రామంలోను, సభలు నిర్వహించి భూ ఆక్రమణలు, 22ఏ భూముల ఆక్రమణ, అన్ని రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రతి గ్రామంలో తహశీల్దార్‌తోపాటు ఏడుగురు అధికారులు సదస్సులో పాల్గొంటారన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ దోపిడీ, రికార్డుల తారుమారు, అడంగళ్ లోపాలు, ఏ1 రిజిస్టర్‌లోని లోపాలు, ఈనం, జిరాటీ భూముల అవకతవకలు, ఆన్‌లైన్ ట్యాపరింగ్, సరిహద్దు వివరాలు తదితర భూ సమస్యలను ఈ సదస్సులో పరిష్కరించుకోవచ్చని ఎమ్మెల్యే చెప్పారు.

రేపు పింఛన్ల పర్యవేక్షక అధికారుల సమావేశం

రంగంపేట, ఆగస్టు 27: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పర్యవేక్షక, పంపిణీ అధికారులకు ఈ నెల 29న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటరత్నం మంగళవారం తెలిపారు. పింఛను సొమ్ము పంపిణీలో పాటించవలసిన విధి విధానాలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఈ సమావేశంలో వివరించనున్నామన్నారు. ఆ రోజు ఉదయం పింఛన్ బట్వాడా పర్యవేక్షక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హాజరుకావాలని, మధ్యాహ్నం 2గంటలకు పైవారు కాకుండా మిగిలిన వారు సచివాలయంలోని ఇతర కార్యనిర్వాహక సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల నుంచి నియమించిన సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో చెప్పారు.

మగ్గం వర్క్‌తో ఆర్థిక చేయూత

రాజానగరం, ఆగస్టు 27: మగ్గం వర్కుతో మహిళలకు ఆర్థిక చేయూత చేకూరుతుందని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. కిర్లంపూడి మండలం బూరుగుపూడిలోని మహిళలకు మగ్గం వర్కుపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఈశిక్షణ ఉపయోగపడుతుందన్నారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికి 4వేలు మందికి పైగా మహిళలు శిక్షణ పొందారన్నారు. అల్లంపల్లి దుర్గ శిక్షకురాలిగా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, సుంకర వీరాస్వామి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 28 ఆగస్టు 2024 | 5

పడుకుని ఉండగానే.. ఇల్లు దోచేశారు
కొవ్వూరు పట్టణంలో దాహం కేకలు 8



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

చవితికి అనుమతులు తప్పనిసరి

అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్/ సిటీ, ఆగస్టు 27 : జిల్లాలో గణపతి నవరాత్రి ఉత్సవాలకు అనుమతులు సింగిల్ విండో ద్వారా ఇస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన వినాయక చవితి ఉత్సవాల అనుమతులు,ముందస్తు చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వినాయక చవితి పండుగను అత్యంత జాగ్రత్తగా నిర్వహించే క్రమంలో మునిసిపల్,మండల స్థాయిలో అనుబంధ శాఖలతో ఈ నెల 30వ తేదీలోగా సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు సిద్ధం చేయాలని తెలిపారు. అధికారుల కమిటీ ఏర్పాటు చేసుకుని ఏ రోజు వచ్చిన దరఖాస్తులపై ఆ రోజే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిబంధనలు మేరకు అనుమతి ఇవ్వాలన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలోని విగ్రహాలను కొవ్వూరు అధికారులు పేర్కొన్న ప్రాంతాల్లోనే నిమజ్జనం చేపట్టాలన్నారు.ఉత్సవాల నిర్వాహకులు సహకరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పంచాయతీ అధికారి తగిన భద్రత చర్యల పర్యవేక్షణ చేపట్టాల్సి ఉందన్నారు. ఎస్‌పి నరసింహకిషోర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అందరు సహకరించాలని కోరారు. డీఎస్పీలు వ్యక్తిగత పర్యవేక్షణ ద్వారా రూట్ మ్యాప్ సిద్ధం చేసి వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జేసీ చిన్న రాముడు, డీఆర్వో జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ఎత్తు 5 అడుగులే ఉండాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో సాధారణ జన జీవనానికి ఇబ్బంది కలగకుండా అల్లర్లకు అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే ఆయా ఉత్సవ కమిటీ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలను వివరిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రహం ఎత్తు 5 అడుగులకు మించి ఉండకూడదని తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి కార్యక్రమాలకూ అనుమతి లేదు. హుండీలు, విలువైన వస్తువులు ఉన్న చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బలవంతంగా చందాలు వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.నిమజ్జనానికి తగు అనుమతి తీసుకోవాలని తెలిపారు.



సొమ్ములిప్పించు.. అప్పులు శ్రీనివాసుడా!

- ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు పలువురు చేబదులు
- ఐదు నెలలైనా సొమ్ములు రాక ఆవేదన
- ఓటమి పాలవడంతో మాట దాటవేత
- సొమ్ములు రాబట్టుకునేందుకు మల్లగుల్లాలు

నిడదవోలు,ఆగస్టు 27 : ఎంత ఖర్చయినా పరవాలేదు.. నేను గెలవాలంతే.. అప్పు చేసి అయినా ఖర్చుపెట్టండి.. గత సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ కింద కూర్చుని ఆ పార్టీ నేతలు చెప్పిన మాట ఇది.. జిల్లావ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలంతా తమ నాయకుడి కోసం కోట్ల రూపాయలు చేబదులుగా ఇచ్చారు. ఆ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఓటరు అడిగింది లేదనకుండా.. ఉద్యోగులు కోరింది కాదనుకుండా ఇచ్చేశారు.. తీరా ఎన్నికలైన తరువాత చూస్తే.. ఓటరు తీర్పు మారింది. కూటమికే పట్టం కట్టారు. కోట్లతో ఓట్లు కొందామని చూసినా వైసీపీ నాయకులకు కో అంటే కోట్లుపోయాయి.. పోనీ గెలుపు అయినా వచ్చిందా అంటే అదీలేదు. అంతే చేబదులు ఇచ్చిన నాయకుల ఫోన్‌లు ఎత్తడం కూడా మానేశారు.ఒక వేళ ఫోన్ ఎత్తినా నేడు రేపు అంటూ వాయిదా మీదా వాయిదా వేస్తుండడంతో చేబదులు ఇచ్చిన నేతలంతా ఆందోళన చెందుతున్నారు. ఓటమి పాలైన ఆ నాయకులు నియోజకవర్గానికి అడపా దడపా వచ్చినా డబ్బు ఇచ్చిన వారు ప్రశ్నిస్తే వాయిదాపై వాయిదా వేస్తూ పక్క రాష్ట్రానికి వెళ్లిపోతున్నారు. కొంత మంది నాయకులైతే అసలు బయటకే రావడంలేదు.గత ఐదేళ్ల జనంలో తిరిగినవారంతా నేడు ఇళ్లకే పరిమితమయ్యారు. గట్టిగా అడిగితే ఇచ్చిన డబ్బులు కూడా వస్తాయో రావో అని నిలదీసేందుకు సైతం డబ్బు ఇచ్చిన వారు వెనుకంజ వేస్తున్నారు.ఇదిలా ఉంటే జిల్లాలోని ఒక నియోజకవర్గంలో ఆ నాయకుడి పరిధిలోని పట్టణ ప్రథమ పౌరుడు సైతం బహిరంగంగా విలేకరుల సమావేశాన్ని పెట్టి ఆ నాయకుడికి తనకు మధ్య అంతరంగిక వ్యవహారాలు ఉన్నాయని చెప్పడం గమనార్హం.వారిద్దరి మధ్య ఉన్న అంతరంగిక వ్యవహారాలు సార్వత్రిక ఎన్నికల్లో సర్దుబాటు చేసిన రూ.1.40 కోట్లు అంటూ కొందరు గుసగుసలాడుకుంటున్నారు.ఈ ఒక్కరి నుంచే కాకుండా ఆ నియోజకవర్గంలో వైసీపీ నేతల నుంచి ఆ నాయకుడు కోట్ల రూపాయలు చేబదులుగా తీసుకున్నట్టు వినికిడి. ఆ నాయకుడు ఓటమి పాలు కావడంతో కోట్లాది రూపాయలు చేబ దులు ఇచ్చిన నేతలంగా ఇప్పుడు ఎలా వసూలు చేసుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌గా ఆ నాయకుడిని మార్చి కొత్తవారిని నియ మించకపోతే పార్టీ కార్యకర్తలంతా పార్టీని వీడే అవకాశం ఉందంటూ సొంత పార్టీ నేతలే పక్క చూపులు చూస్తున్నారు. ఎన్నికల ముందు వరకు ఆ నాయకుడి అడుగులో అడుగు వేసిన కొందరు కౌన్సిల్ సభ్యులు సైతం అధికారం కోల్పోగానే అసలు స్వరం వినిపించారు. పలువురు కౌన్సిల్ సభ్యులు జనసేనతో జతకట్టేందుకు సై అనగా మరికొందరు తమ రాజ కీయ భవిష్యత్తుపై వ్యూహరచన చేస్తున్నారు.పార్టీ కేంద్ర కార్యాలయం నియోజకవర్గానికి మరొకరిని ఇన్‌చార్జిగా నియమిస్తే పార్టీకి తిరిగి పూర్వ వైభవం వస్తుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు అంటున్నారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు నియోజకవర్గాల్లో నూ ఇదే పరిస్థితి ఉంది. చేబదులు ఇచ్చిన నాయకులు కక్కలేక మింగలేక ఉన్నారు. ఏదో ఒక విధంగా తమ సొమ్ము రాబట్టుకునేందుకు చూస్తున్నారు. అయితే వైసీపీ నాయకులు మాత్రం ఎన్నికల్లో అంతా ఖర్చయిపోందని మాటదాట వేస్తూ పబ్బం గడుపుతున్నారు. ఎన్నికలు పూర్తయి ఐదు నెలల అవుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.నాయకులకు పెద్ద మొత్తంలో సొమ్ములు చేబదులు ఇచ్చిన వైసీపీ నేతలంతా ఓ శ్రీనివాసుడా మాపై దయచూపించమనవయా అంటూ ఆ వడ్డీకాసులవాడిని వేడుకుంటున్నారు.కూటమి నేతల వద్ద పంచాయితీలు పెడుతున్నారు.జిల్లా రాజకీయ వర్గాల్లో ఇది హాట్ టాఫిక్‌గా మారింది.



గోదాట్లో.. డ్రెడ్జింగా!?

ఆ బోట్లు ఎందుకొచ్చాయ్..


రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో మంగళవారం ప్రత్యక్షమైన డ్రెడ్జింగ్ బోట్లు

- అనుమతుల్లేకుండా డ్రెడ్జింగ్ బోట్లు
- గామన్ బ్రిడ్జి సమీపంలో ట్రయల్స్
- అటూ ఇటూ తిరగడంతో అనుమానాలు
- ర్యాంపుల్లో బాటలు.. జేసీబీలు రెడీ
- ఇంకనూ పర్యావరణ అనుమతుల్లేవ్
- జిల్లాలో తీవ్రంగా ఇసుక కొరత
- నిలిచిపోయిన భవన నిర్మాణాలు
- ఇసుక సరఫరాపై అధికారుల దృష్టి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అధికారులు చెబుతున్నది ఒకటి.. క్షేత్రస్థాయిలో జరుగుతున్నది మరొకటి..గోదావరిలో ఇసుక తవ్వకాలకు ఇంకా పర్యావరణ అనుమతులే రాలేదు.. అయితే మంగళవారం గోదావరిలో డ్రెడ్జింగ్ బోట్లు తిరగడం చర్చనీయాంశమైంది. ఇవి ఎక్కడ నుంచి వచ్చాయ్.. అనుమతుల్లేకుండా ఎలా తిరుగుతున్నాయ్.. ఎందుకు తిరుగుతున్నాయ్.. అనే అనుమానాలు తలెత్తాయి.ఒక పక్క అధికారులు ఉచిత ఇసుక సరఫరాపై మల్లగుల్లాలు పడుతుంటే ఇంకో పక్క డ్రెడ్జింగ్ బోట్లు తిరగడం పలు విమర్శలకు తావిచ్చింది. గోదావరి వరదల నేపథ్యంలో ప్రస్తుతం ఇసుక సరఫరా నిలిపివేశారు. దీంతో జిల్లాలో ఇసుక కొరత విపరీతంగా ఉంది. ఐదు యూనిట్ల ఇసుక రూ. 23 వేల వరకు ధర పలుకుతుందంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉచిత ఇసుక అంటూ అందుబాటులోకి తేవడంతో భవన నిర్మాణదారులంతా ఆనందపడ్డారు. అంతలోనే వరదలు రావడంతో ఇసుక కొరత వచ్చి ఆందోళన చెందుతున్నారు.ఈ నెల 10వ తేదీకి ముందే ఇంటి నిర్మాణాలకు ముహూర్తాలు పెట్టుకుని ఇసుక లేక చాలా మంది నిర్మాణాలు ఆపేసి కూర్చుకున్నారు. జిల్లాలో ఇసుక ర్యాంపులకు ఎపుడు అనుమతి ఇస్తారో .. ఇసుక ఎప్పుడు వస్తుందోనని భవన నిర్మాణదా రులకు ఎదురుచూపులు తప్పడంలేదు.

డ్రెడ్జింగ్ బోట్లు ఎలా వచ్చాయ్..

గామన్ బ్రిడ్జి సమీపంలోని కాతేరు ర్యాంపుల్లో డ్రెడ్జర్లు బోట్లు మంగళవారం ట్రయల్స్ వేయడం చర్చనీయాంశమైంది. పైగా కాతేరు నుంచి వెంకటనగర్ వరకూ అన్ని ర్యాంపుల్లో డ్రెడ్జింగ్ బోట్లు ప్రత్యక్షమయ్యాయి.మరో ప్రక్క ర్యాంపుల బాటలను జేసీబీలతో శుభ్రం చేస్తున్నారు. ఈ ర్యాంపులకు కొంత దూరంలోని హైవే ప్రక్కన వ్యవసాయ కళాశాల సమీపంలో గతంలో ఇసుక స్టాక్ పాయింట్ ఉండే ప్రాంతాన్ని చదును చేశారు. డ్రెడ్జింగ్ బోట్లు బ్రిడ్జి కింద నుంచి అటూ ఇటూ నడుపుతూ హడావిడి చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ డ్రెడ్జింగ్‌కు అనుమతి ఇస్తారే మోననే ప్రచారం జరుగుతోంది.మరో పక్క జిల్లా లోని ర్యాంపులు మూతపడి ఉన్నాయి. ఓపెన్ ర్యాంపులు ప్రారంభమయ్యే వరకూ ఇసుక కొరత లేకుండా అఖండ గోదావరిలో డీసిల్టేషన్ పేరిట ఇసుక తీయడానికి 9 ర్యాంపులు గుర్తించారు. వాటికి కొన్ని అనుమతులు రావలసి ఉంది. ఇరిగేషన్ ఆధ్వర్యంలో ర్యాంపుల్లో బోట్స్‌మన్ సొసైటీల ద్వారా ఇసుక తీయడానికి టెండర్లు పిలవాలని భావించారు.ఇంకా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు రాలేదు.దీంతో ఆలస్యం అవుతోంది. ఇదిలా ఉండగా ఇక టెండర్లు పిలవకుండానే బోట్స్‌మన్ సొసైటీల ద్వారా ఇసుక తీసే ఆలోచన కూడా అధికారులు చేస్తున్నట్టు సమాచారం. ఇది వాస్తవ రూపం దాల్చకపోతే వచ్చే నెల 11వ తేదీ వరకూ ఇసుక లేనట్టే. కానీ ఈలోపు ఇసుక సమస్యను పరిష్కరించాలనే ఆలోచనతో అధికారులు ఉన్నారు. గామన్ బ్రిడ్జికి అవతల వైపు కాతేరు నుంచి సీతానగరం వైపు మైన్స్ అధికారుల ఆధ్వర్యంలో అనుమతులు రానున్నాయి. ప్రస్తుతం ఏవిధమైన అనుమతులు లేవని అధికారులు చెబుతుంటే..కాతేరు ర్యాంపుల్లో డ్రెడ్జింగ్ పడవల సందడి అనుమానాలు తావిస్తోంది.

ఇసుక రవాణా వాహనాలకు జేసీ అనుమతి తప్పనిసరి : కలెక్టర్

ఉచిత ఇసుక కోసం రీచ్‌లకు వచ్చే వాహనాలకు స్లాట్ కేటాయింపు చేసి ట్రక్కు షీట్ జారీ చేయవలసి ఉందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టం చేశారు.కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె జేసీ చినరాముడు, డీఆర్వో జి.నరసింహులుతో కలసి డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఇసుక రవాణా వాహనాలకు జేసీ అనుమతి తీసుకోవాలని, ఆయన జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి మాత్రమే బుకింగ్ పాయింట్ వద్దకు అనుమతించి ట్రక్ షీట్ జారీ చేయాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో ఎటువంటి అవకతవకలు లేకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు. ఇక పెండింగ్‌లో ఉన్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీలు 492లో 490 పరిశీలించినట్టు చెప్పారు. హౌసింగ్ ప్రాజెక్టు పీడీ వద్ద ఒకటి, బిక్కవోలు మండల సర్వేయర్ వద్ద ఒకటి పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు.

పోలీస్ స్టేషన్లలో అక్రమ ఇసుక ఏం చేస్తారు?


పెరవలి స్టేషన్‌లో ఉన్న ఇసుక

పెరవలి, ఆగస్టు 27 : ఇసుక ఎక్కడున్నా బంగారమాయే.. ప్రస్తుతం గోదావరికి వరదలు వస్తున్నందు వల్ల ఇసుక తీయడం కుదరదు. అందువల్ల ఎక్కడ గుట్టలు ఉన్నా దానికి అమిత డిమాండ్ ఉంటుంది. ఇటీవల ప్రభుత్వం స్టాక్ పాయింట్ల నుంచి ఇస్తున్న ఇసుకను ఆగమేఘాలపై తీసుకుపోయారు. డిమా ండ్‌కు తగ్గ సరఫరా కూడా చేయలేక రెండు రోజులు వేచి ఉంటేనే గాని ఒక్క లారీ కూడా ఎగుమతి కాని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఎక్కడ అక్రమ నిల్వలు ఉన్నా వాటిని వెలికి తీయాల్సి బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉంది. పెరవలి పోలీసు స్టేషన్ పరిధిలో గత ఐదారేళ్లలో అక్రమ ంగా పట్టుకున్న ఇసుకను ఇరిగేషన్ స్థలంలో నిల్వ ఉంచారు. అయితే అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ ఇసుక గుట్ట నిండా పిచ్చి మొక్కలు మొలిచిపోయాయి.అక్కడ ఇసుక ఎంత ఉందో కూడా తెలియని పిరిస్థతి. అక్రమంగా తీసుకువెళుతున్న ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి అదే ఆవరణలో ఉంచగా అది కూడా తుప్పు పట్టి ఇసుకలో కలిసిపోయింది.ఈ పరిస్థితుల్లో ఆ ఇసుకను వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఈ దిశగా పోలీస్ రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ప్రస్తుతం ఇసుక కొరతగా ఉండడం వల్ల దానిని వేలం వేయాలని కోరుతున్నారు.దీనిపై ఎస్ఐ అప్పారావును ప్రశ్నించగా ఇసుక విషయ మై ఉన్నతాధికారులకు నివేదించా..త్వరలోనే వేలం వేయడానికి రంగం చేస్తారని పేర్కొన్నారు.



రైల్వే ప్రయాణికులకు భద్రతేది!

- తొలగని గ్రహణం.. తెరుచుకోని రైల్వే ఆటో బూత్
- ప్రయాణికుల భద్రతపై కానరాని శ్రద్ధ
- రాత్రివేళ ఒంటరి మహిళలకు తప్పనితిప్పలు
- ఎంపీ పురందేశ్వరి కల్పించుకోవాలని వినతులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికుల భద్రతపై అలసత్వానికి రెడ్ సిగ్నల్ పడడం లేదు. రైల్వే స్టేషన్‌లో రక్షణ మాట అటుంచితే..అర్ధరాత్రి వేళ రైలు దిగి రోడ్డుపైకి వస్తే ఇంటికి చేరతామన్న నమ్మకం కొరవడింది. మొన్న కోల్‌కతాలో ఓ వైద్యురాలిపై దారుణం..నిన్న అసోంలో ఓ విద్యార్థినిపై అఘాయిత్యం పాఠాలు నేర్పినట్టు కానరావడం లేదు. ఏదోక ఘోరం జరిగితే.. ఆ కుటుంబం శోకంలో మునిగిపోతే అప్పుడు చర్యలు చేపడతామనే తీరు విస్మయానికి గురి చేస్తోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో రైల్వే స్టేషన్లో దిగుతున్న మహిళలు, వృద్ధులు, పిల్లలు తెల్లారేవరకూ స్టేషన్లోనే ఉండే పరిస్థితి ఉంది. శివారు ప్రాంతాలకు వెళ్లడానికి పురుషులు సైతం ధైర్యం చేయలేకపోతున్నారు. ఈ దుస్థితిని గమనించి ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన రైల్వే ప్రీ పెయిడ్ ఆటో బూత్ నాలుగేళ్లుగా నిద్దరోతోంది. ఇప్పటికే ఎన్ఎస్‌జీ-2 హోదా కలిగిన స్టేషనులో కీలకమైన ఆటో బూత్‌ని తుడిచి మరుస్తుండడాన్ని అభద్రత వెక్కిరిస్తోంది.రైల్వే స్టేషన్ సమీపంలో పలుమార్లు అసాంఘిక వ్యక్తుల వద్ద గంజాయి పట్టుబడినా.. ముందస్తు జాగ్రత్తలు ఇంకా కళ్లు తెరవకపోవడం గమనార్హం.

నాడు టీడీపీ హయాంలో..

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017 మార్చి 29న రైల్వే స్టేషనులో ఆటో ప్రీపెయిట్ బూత్‌ని ఏర్పాటు చేశారు. దీనికి అప్పటి ఎస్పీ బి.రాజకుమారి ప్రత్యేక చొరవ చూపారు. ఇది మనుగడలో ఉన్నంత కాలం ప్రయాణికుల భద్రతకు ఇబ్బంది ఉండేది కాదు. బూత్‌లో 24/7 సేవలు అందించేవారు. రైల్వే స్టేషను నుంచి ఎక్కువ గా రా క పో క లు సాగించే ప్రాంతాలు, శివారు ప్రదేశాలకు ధరలు నిర్ణయించిన బోర్డు ఉండేది.ప్రయాణికులు ఏ సమయంలో వచ్చి కోరినా పోలీసులు వారి పేరు వివరాలు నమోదు చేసుకొని,ఆటో డ్రైవరు ఫోన్ నంబరు తీసుకొని సీరి యల్ విధానంలో పంపించడం జరిగేది. దీంతో ఒంటరి మహిళలు సైతం రాత్రి సమయాల్లో ఏ భయమూ లేకుండా ఇంటికి చేరేవారు.

ఎంపీ కల్పించుకోవాలి..

రైల్వే స్టేషన్లో భద్రతకు ప్రభుత్వ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం ఉంటాయి. స్టేషను దాటి బయటకు వస్తే మాత్రం టూటౌన్ పోలీసులు భద్రత కల్పించాల్సి ఉంటుంది. ప్రతి రోజూ సరాసరి ఈ రైల్వే స్టేషను గుండా 36 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. రాజమండ్రి రైల్వే స్టేషనుకు పగటి కంటే రాత్రి వేళల్లోనే ఎక్కువగా రైళ్లు వస్తుంటాయి. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణికుల ఇక్కడి నుంచి ఇంటికి చేరుకోడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇంటి వద్ద నుంచి ఎవరైనా వస్తే వెళ్లడం లేదా ఉదయం వరకూ స్టేషన్లోనే ఉండిపోవడం చేస్తున్నారు. ప్రస్తుతం ఎంపీ పురందేశ్వరి రైల్వేస్టేషను అభివృద్ధిపై దృష్టి సారించారు. దీనిలో భాగంగానే భద్రతకు సంబంధించిన ఆటో ప్రీపెయిడ్ బూత్‌ని దారిలో పెట్టాలని ప్రయాణికులు ఎంపీని కోరుతున్నారు.

ఎందరు ఎస్పీలు మారినా..

కరోనా సమయంలో ఆటోబూత్‌ని తాత్కాలికంగా మూసేశారు. నాటి నుంచీ ఈ బూత్‌కి పట్టిన గ్రహణం వీడడం లేదు. ఎందరు ఎస్పీలు మారినా రైల్వే ప్రయాణికులు రైల్వే స్టేషను దాటి బయటకు వచ్చిన తర్వాత భద్రత ప్రశ్నార్థకంగానే ఉంది. ఏడాది క్రితం హడావుడిగా శుభ్రం చేసి వదిలేశారు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో మళ్లీ ఈ ఏడాది జూన్ 9న అదే హడావుడిని రిపీట్ చేశారు. ఎందుకనో మళ్లీ భద్రతను గాలికి వదిలేశారు.బూత్‌లోని కంప్యూటర్లు,ప్రింటర్లు, ఫర్నీచరు ఏమయ్యాయో తెలియదు. అప్పట్లో సౌత్ జోన్ పరిధిలో ఈ బూత్ నిరంతరంగా సేవలందించేది.ప్రస్తుతానికి కరెంటు మీటరు ఒక్కటే ఇప్పటికీ పని చేస్తూ యంత్రాంగం చిత్తశుద్ధిని హేళన చేస్తోంది. మళ్లీ ఈ బూత్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కండువా.. మార్చేయ్!

వైసీపీ నాయకుల యూటర్న్

- నాడు వైసీపీ ప్రజాప్రతినిధులతో చెట్టాపట్టాల్
- నేడు కూటమి నేతల వద్దకు చేరుతున్న వైనం
- షాడోలుగా మారి చక్రం తిప్పుతున్నారు..
- బదిలీల్లోనూ వారిదే పైమాట..
- ఎన్నికల్లో కష్టపడిన నేతల కినుక

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 27 : రాజకీయాల్లో శాశ్వత మిత్రులు ఉండరు.. శాశ్వత శత్రువులు ఉండరు.. ఇది జనమెరిగిన సత్యమే.. ప్రస్తుతం కూటమి నేతలు ఇదేం నిజం చేస్తున్నారు.. నాడు వైసీపీ అధికారంలో ఉండగా కాలరెగరేసిన నేతలు ప్రస్తుతం కాలరుదించేసి కూటమి కింద చేరుతున్నారు. పరాయి వారిని పంచన చేర్చుకోవడంతో అసలు నేతలకు రుచించడం లేదు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు వెంట తిరుగుతూ వ్యవహారాలు చక్కబెట్టి చక్రం తిప్పిన అజ్ఞాతవాసులు ఇప్పుడు యూ టర్న్ తీసుకున్నారు.ఉద్యోగుల బదిలీలు మొదలుకొని కాంట్రాక్టులు, అక్రమ నిర్మాణాలు, అక్రమ మైనింగ్, భూదందాలు చేసేవారంతా బ్యాక్ డోర్ గుండా కూటమి నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు.షాడోలుగా మారి పైరవీలు చేస్తున్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున జరుగుతున్న ఉద్యోగులు బదిలీల ప్రక్రియలోనూ వారే చక్రం తిప్పుతున్నారు.పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, మునిసిపాలిటీ తదితర శాఖల్లో వారిదే పైచేయిగా ఉంది. కలెక్టరేట్ రెవెన్యూ విభాగంలో ఒకరు వారి శాఖలో ఉద్యోగులు బదిలీల విషయంలో బాగా సహకరిస్తూ ప్రజాప్రతినిధులు సిఫార్సులను తూచా తప్పక అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కూడా ఈ అధికారి చక్రం తిప్పారు. డిమాండ్ ఉన్న పోస్టులకు షాడోలు రేటు పెట్టేశారు.వారికి అధికారులు సహకరిస్తున్నారు. ఎందుకంటే ఆయా ప్రాంతాల్లో పోస్టులకు ఉన్న డిమాండ్‌ను బట్టి ధర నిర్ణ యిస్తున్నారు. పంచాయతీల విషయానికి వస్తే రూరల్ మండలం హుక్కుంపేట పంచాయతీ కార్యదర్శిగా వేమగిరి కార్యదర్శిని సిఫార్సు చేసినట్టు తెలిసింది.ఇదే ఉద్యోగి సీతానగరం మండలం రఘుదేవపురం పంచా యతీలో నిధుల దుర్వినియోగం అభియోగంపై షోకాజ్ నోటీసు అందుకున్నారు. సదరు ఉద్యోగి ప్రస్తుతం వేమగిరిలో పనిచేస్తుండగా అక్కడా అభి యోగాలు ఉన్నాయి.కోలమూరులో గతంలో పనిచేసిన కార్యదర్శి అప్పట్లో భారీమొత్తంలో పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. అదే కార్యదర్శిని మళ్లీ కోలమూరుకు సిఫార్స్ చేసినట్టు తెలిసింది. రాజానగరం మండలం పాలచర్ల పంచాయతీలో ఇద్దరికి ఎమ్మెల్యే సిఫార్స్ లేఖలు ఇవ్వడం తాంబూళం ఇచ్చాం తన్నుకు చావండి అన్నట్టుగా ఉంది. ఇలా అనేక బదిలీలు జరుగుతున్నాయి. ఇక రెవెన్యూలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నిబంధలనకు తూట్లు పొడుస్తున్నారు. సాధారణంగా ఒక చోట ఐదేళ్లు నిండిన ప్రతి ఉద్యోగిని బదిలీ చేయాలనే నిబంధన ఉంది. అయితే అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో (పరిపాలన సౌలభ్యం) కోసం అంటూ నచ్చిన వారికి, సొమ్ములు ఎక్కువ ఇచ్చిన వారిని బదిలీ చేసేందుకు శ్రీకా రం చుట్టారు.బదిలీలకే లక్షలు ఖర్చుచేసుకుని సీటు నిర్ధారించుకున్న అధికారులు,ఉద్యోగులు వాటిని రికవరీ చేసుకోవడానికే చూస్తారు.. ప్రజలకేం ఉపయోగపడతారు. అందువల్ల ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే పరిస్థి తి ఉండదనేది అందరికి తెలిసిన విషయమే. ఇదంతా చూస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు నోరెళ్లబెడుతున్నారు. తామంతా కష్టపడి కూటమిని అధికారంలోకి తీసుకొస్తే షాడోలు చక్రం తిప్పడంపై మండిపడుతున్నారు.

నైతిక విలువలకు తిలోదకాలు..

పూర్వం ఉద్యోగి నడవడిక, వృత్తిలో అంకితభావం, ప్రజలకు సర్వీసు చేయాలనే తపన ఉన్న ఉద్యోగులను ఏరికోరి రప్పించే పరిస్థితులు ఉండేవి. మారిన రాజకీయాల నేపథ్యంలో పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. నాయకులు బదిలీలను ఆదాయ వనరుగా చూడడంతో అన్నీ పక్కదారి పటేశాయి. అధికారి ఉద్యోగుల ట్రాక్ రికార్డుతో పనిలేకుండా క్యాష్‌తో గుర్తిం పు ఇవ్వడం సమాజంలో నైతిక విలువలకు తిలోదకాలు ఇవ్వడమే. గత ప్రభుత్వం చేసిన తప్పులను ప్రక్షాళన చేయాలంటే ప్రభుత్వ శాఖల్లో అవి నీతి అక్రమాలను రూపుమాపాలి.ఉద్యోగుల ట్రాక్ రికార్డును పరిశీలించి నిర్ణ యం తీసుకోవాలని పలువురు సీనియర్ నాయకులు ,సీనియర్ సిటిజన్ల వాదన.

'దుబాయ్‌లో తెలుగు భాషా దినోత్సవాలు'

రాజమహేంద్రవరం కల్చరల్,ఆగస్టు 27 :తెలుగు భాషా వికాసానికి దోహదపడుతూ..దుబాయ్‌లో ఐదు రోజుల పాటు తెలుగుభాషా ఉత్సవాలు జరగబోతున్నాయని వ్యవహారిక భాషా ఉద్యమకారుడు,గిడుగు రామ్మూర్తి మునిమనుమరాలు,గిడుగు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గిడుగు కాంతి కృష్ణ వెల్లడించారు.దుబాయ్ తెలుగు సంఘం నిర్వహించే ఈ ఉత్సవాల్లో గిడుడు స్మరణతో పాటు, తెలుగు భాషావేత్తల స్మరణ జరుగుతుందని తెలిపారు. సీపీ బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిదానం శాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో మంగళవారం గిడుగు తైల వర్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం గిడుగు కాంతి కృష్ణను సత్కరించారు.కార్యక్రమంలో రాకా రమణ, వైచిట్టిబాబు,ముంగండ సూర్యనారాయణ, నల్లగొండ రవి ప్రకాష్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలి : ఎంపీపీ



దేవరపల్లిలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, ఆగస్టు 27: మండలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు ఆదేశించారు. దేవరపల్లిలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యదర్శులు సర్పంచ్‌లతో సమన్వయం చేసుకుని శానిటేషన్ పనులు చేయాలన్నారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెత్తాచెదారం లేకుండా చూడాలని చెప్పారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, పైపులైన్లు లీకేజీలు ఉంటే అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరరావు, తహశీల్దార్ రామలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు నుంచి నవశైవక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు

కొవ్వూరు, ఆగస్టు 27: కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి నవశైవక్షేత్ర దర్శిని స్పెషల్ బస్సును డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ బస్సు కొవ్వూరు డిపో నుంచి మంత్రాలయం, అలంపురం జోగులాంబ, మహానంది, యాగంటి, బనగానపల్లె, త్రిపురాంతకం, శ్రీశైలం, కోటప్పకొండ, విజయవాడ మీదుగా తిరిగి కొవ్వూరు చేరుకుంటుందన్నారు. నాలుగురోజుల పాటు ఈ టూర్ ఉంటుందన్నారు. నవశైవక్షేత్ర దర్శిని స్పెషల్ సర్వీసును కొవ్వూరు నుంచి నాలుగోసారి పంపించామన్నారు.

పాఠశాలకు ఇన్వెర్టర్, కంప్యూటర్ అందజేత



దూబచర్ల హైస్కూల్‌కు ఇన్వెర్టర్, ప్రింటర్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

నల్లజర్ల, ఆగస్టు 27: దూబచర్ల హైస్కూల్ 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం రూ.40 వేలు విలువ చేసే ఇన్వెర్టర్, కంప్యూటర్, ప్రింటర్‌ను ప్రధానోపాధ్యాయురాలు సుమతికి అందించారు. కార్యక్రమంలో కూరపాటి శేషారావు, గుడే శ్యామ్, దొడ్డిపిడి సుందరావు, చవాకుల ధర్మరాజు, మొండ్రు జయలక్ష్మి, శ్రీనివాసరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడిగా చిన్నా



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 27: ది వాడబలిజ సాండ్ క్వారీ బోట్స్‌మేన్ అండ్ ఫిషర్‌మేన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొవ్వూరు గోదావరి గట్టుపై సుబ్రహ్మణ్య స్నానఘట్టం వద్ద రామాలయంలో మంగళవారం కడియం ఫిషరీస్ డెవలప్‌మెంటు అధికారి డి.గోవిందరావు ఆధ్వర్యంలో ఫిషర్‌మేన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడిగా అర్జిల్లి చిన్నా, సెక్రటరీగా పిక్కి కొవ్వూరు, సభ్యులుగా కంబాల బంగారయ్య, మేరుగ లక్ష్మణ్, ఉప్పాడ చక్రవర్తి సహా ఏడుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటి సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, అర్జిల్లి రామకృష్ణ, దాయన రామకృష్ణ, పిక్కి నాగేంద్ర అభినందించారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేత సింగరాజు వర్ధంతి



సింగరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు

తాళ్లపూడి, ఆగస్టు 27: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) పేరుతో ఉద్యమ సంస్థను స్థాపించిన సింగరాజు రామకృష్ణయ్య వర్ధంతిని మంగళవారం గజ్జరం ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. దీనికి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రామకృష్ణయ్య ఉద్యమ విధానాన్ని ఉద్యమ తత్వాన్ని కొనియాడారు. 1911 జూలై 1న కనిగిరి తాలూకా తలకొండపాడు జన్మించిన ఆయన 1931లో ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టారన్నారు. 1960 తర్వాత ఉపాధ్యాయ సంఘాలను ఏకం చేసి ఫ్యాప్టో నిర్మాణానికి బాటలు వేశారన్నారు. అనంతరం ఏపీటీఎఫ్‌కు 40 ఏళ్ల పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఎమ్మెల్సీగా పనిచేసి ఉపాధ్యాయ సమస్యలపై దీర్ఘకాల పోరాటాలు నడిపారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు రఘువీరశాస్త్రి, యాదం శంకరం తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

చాగల్లు, ఆగస్టు 27: చాగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలకుమారి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వీరాస్వామి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు సహా అధికారులు, ప్రజాప్రతినిధులందరూ తప్పక హాజరుకావాలని చెప్పారు.

పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి

గోపాలపురం, ఆగస్టు 27: పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం ఎంతో అవసరమని ప్రధానోపాధ్యాయుడు వీజే కుమార్ అన్నారు. మండలంలోని వాదాలకుంట జడ్పీ హైస్కూల్లో గ్రామానికి చెందిన దాత దుగ్గిరాల రాంబాబు సెపక్‌తక్రా క్రీడకు రూ.20వేలు విలువ చేసే నాలుగు బాల్స్, నాలుగు నెట్‌లను మంగళవారం అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడాస్ఫూర్తిని పెంచాలన్నారు.

మాదిగల కృతజ్ఞత యాత్ర జయప్రదం చేయాలి



ఉండ్రాజవరం, ఆగస్టు 27: మాదిగల కృతజ్ఞత యాత్రను విజయవంతం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సుజనరావు కోరారు. ఈ మేరకు కాల్దరి గ్రామంలో మంగళవారం కృతజ్ఞత యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుజనరావు మాట్లాడుతూ ఈ నెల 16న ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు హిందూపురంలో మొదలు పెట్టిన కృతజ్ఞత యాత్ర ఇచ్ఛాపురం వరకు కొనసాగుతుందన్నారు. ఆయా జిల్లాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యార్లగడ్డ వెంకటరత్నం, చీలి బుజ్జిబాబు, చదలవాడ ప్రవీణ్, కోరుమిల్లి రాజు, చదలవాడ ముద్దుకృష్ణ, కొల్లేటి బాబు పాల్గొన్నారు.

31న మెగా రక్తదాన శిబిరం

రాజానగరం, ఆగస్టు 31: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ 31న రాజానగరంలోని రాయల్ పంక్షన్ హాల్లో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఆరోజు ఉదయం 10గటలకు ప్రారంభించనున్న ఈ శిబిరానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

కొవ్వూరులో దాహం కేకలు

- కమిషనర్, ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయలోపం
- తాగునీటి సమస్య పట్టని అధికారుల తీరుపై పాలకవర్గం ఆగ్రహం
- వీధిదీపాలు వెలగక పెరుగుతున్న దొంగతనాలు : కౌన్సిలర్లు
- అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి : ఎమ్మెల్యే
- వాడివేడిగా కొవ్వూరు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, ఆగస్టు 27: ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించడంలో మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయలోపం స్పష్టంగా కనిపిస్తుందని పాలకవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతను మంగళవారం జరిగింది. కంఠమణి రమేష్‌బాబు మాట్లాడుతూ మునిసిపల్ జేసీబీని అద్దెకు ఇవ్వడం సరికాదన్నారు. తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు నిర్వహణ సేవలు పూర్తిస్థాయిలో అందించకపోతే మున్సిపాల్టీ ఇంకేం చేస్తుందని ప్రశ్నించారు. ఏటా వేసవిలో లక్షల రూపాయలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పెడుతున్నారని, వాటర్‌వర్క్సులో మోటార్లు చెడిపోతే స్పేర్ మోటార్లు ఎందుకు ఏర్పాటుచేసుకోవడం లేదన్నారు. తాగునీరు అందకపోవడంపై 22వ వార్డు ప్రజలతో కలిసి స్పందనలో ఫిర్యాదు చేసినట్టు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రెండేళ్లుగా వీధి దీపాలపై ప్రశ్నిస్తుంటే డ్రైవర్స్ లేవంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాగే డంపింగ్‌యార్డు సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతినెలా తాగునీటి సమస్య ఎందుకు వస్తుందని ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మున్సిపల్ జేసీబీని ఇతర శాఖల అధికారులకు అద్దె ప్రాతిపదికన అందించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పాలూరి నీలిమ మాట్లాడుతూ వీధిదీపాలు వెలిగించకపోవడంతో రాత్రుళ్లు దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. బత్తి నాగరాజు మాట్లాడుతూ వార్డుల్లో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వడంలేదన్నారు. పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో 23 చోట్ల పైపులైన్లు లీకులు, ఎక్కడికక్కడ మరమ్మతుల పేరుతో పెద్ద పెద్ద గోతులు తవ్వి నెలల తరబడి వదిలేస్తున్నారని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కండెల్లి రామారావు మాట్లాడుతూ ఔరంగాబాద్ నుంచి కొవ్వూరు టోల్‌గేటు వరకు వీధిదీపాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఔరంగాబాద్ నుంచి డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీరు పంటలపై చేరి రైతులు నష్ట పోతున్నారన్నారు. 40అడుగుల రోడ్డును ఇరు పక్కలున్న రైతులు ఆక్రమించుకోవడంతో ప్రస్తుతం ఐదడుగులు కూడా లేదని, రోడ్డును విస్తరించి, డ్రైనేజి నిర్మాణం చేపట్టాలన్నారు. మద్దిపట్ల సాయిగీత మాట్లాడుతూ 5వ వార్డులో రోడ్డు తవ్వి 5 నెలలుగా వదిలేశారని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్టరును, ఏఈలను అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. మెయిన్‌రోడ్‌లోని డ్రైనేజీలో పూడికలు తీయించాలన్నారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కొవ్వూరులో కౌన్సిల్ సమావేశ దృశ్యం

పుష్కరాలకు పట్టణాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో మూడునెలలుగా తాగునీటి సమస్యను గుర్తించామని, కొత్త పైపులైను నిర్మాణానికి ప్రతిపాదనలు అందించాలన్నారు. ఖాళీస్థలాలను యజమానులు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆర్‌ఆర్ బ్రిడ్జి నుంచి గామన్ బ్రిడ్జి వరకు డివైడర్ మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. రాబోయే పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని పట్టణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. గోదావరి బండ్‌ను శుభ్రం చేయాలన్నారు. మెరకవీధి వాటర్‌ట్యాంకు నుంచి మెయిన్ రోడ్ వరకూ సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే పట్టణంలో శిథిలావస్థకు చేరిన బీసీ, ఎస్సీ వసతి గృహాల నిర్మాణానికి, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి అందిస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు.

బంగారం వ్యాపారి ఇంట్లో భారీ చోరీ

- 50 కాసుల గోల్డ్, రూ.2 లక్షల నగదు అపహరణ
- కొవ్వూరులో పోలీసుల దర్యాప్తు ముమ్మరం

కొవ్వూరు, ఆగస్టు 27: కొవ్వూరులో బంగారం వ్యాపారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంట్లో యజమానులు నిద్రిస్తుండగానే ఈ ఘటన జరగడం సంచలనం కలిగించింది. పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు వీధిలో ఉంటున్న ఉషశ్రీ జ్యూయలర్స్ యజమాని కట్టా ఉషశ్రీ అపార్టుమెంట్లో దొంగలు పడ్డారు. మంగళవారం తెల్లవారుజామున 3నుంచి 4గంటల మధ్యలో దుండగులు వెనుక ఇంటి పైనుంచి ఉషశ్రీ ఇంట్లో ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లో అందరూ నిద్రపోతుండగా వారి పక్కనే ఉన్న అలమర, బీరువాలలో ఉంచిన 50 కాసుల బంగారు వస్తువులు, రూ.2 లక్షల నగదు, సెల్‌ఫోన్‌ను అపహరించారు. వాటితో వెళ్లిపోతూ అపార్టుమెంటు కింద పార్కింగ్‌లో ఉంచిన యాక్టివా స్కూటీని దొంగిలించుకుపోయారు. ఇంటి యజమాని నిద్ర నుంచి లేచిచూడగా అలమర, బీరువాలు తెరచి ఉండడంతో దొంగతనం జరిగిందని గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ జి.దేవకుమార్, పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, పట్టణ ఎస్ఐ కె.జగన్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రప్పించి వేలిముద్రలు సేకరిస్తున్నారు. చుట్టు పక్కల ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. ఉషశ్రీ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. దీంతో పాటు మరో రెండు ఇళ్లలో చోరీకి యత్నించి విఫలమైనట్టు ఆ ఇంటి యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ కేసు ఛేదించేందుకు డీఎస్పీ ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.





ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు, తెరిచి ఉన్న బీరువా

దాతల సహకారంతో సమస్యలకు సత్వర పరిష్కారం

- ఎమ్మెల్యే మద్దిపాటి..జగన్నాథపురంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం



జగన్నాథపురంలో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, ఆగస్టు 27: గ్రామీణ ప్రాంతాల్లోని సామాజిక అవసరాలకు దాతలు సహకరిస్తే సమస్యకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. జగన్నాథపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు గారపాటి బాపినీడు జ్ఞాపకార్థం ఆయన కుటుంబీకులు గారపాటి కిషోర్, కాట్రగడ్డ సురేష్, సంధ్యారాణి దంపతుల ఆర్థిక సాయంతో నిర్మించిన ఎన్‌టీఆర్ సుజల స్రవంతి ఉచిత నీటిశుద్ధి కేంద్రాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగు యువత మండలాధ్యక్షుడు కాట్రగడ్డ సురేష్ పుట్టినరోజును నిర్వహించారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో గ్రామంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామసత్యవతి, ఉపసర్పంచ్ పసుమర్తి రాఘవచౌదరి, టీడీపీ మండలాధ్యక్షుడు సత్యానారాయణ, పసుమర్తి గంగాధర్, కోడూరి రఘురామ్, వేములపల్లి సచ్చిదానంద, నాగార్జున, వేములపల్లి వివేకనందా, పసుమర్తి పెద్దబ్బులు, వి.రమేష్ పాల్గొన్నారు.

'నరసన్న' భూములపై నిషేధాన్ని తొలగించాలి

- దేవదాయ శాఖ మంత్రి ఆనంకి ఎమ్మెల్యే బత్తుల వినతి

రాజానగరం/కోరుకొండ, ఆగస్టు 27: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఈ మేరకు మం గళవారం అమరావతిలో వివిధ శాఖల మంత్రులను ఆయన మర్యాద పూర్వ కంగా కలిశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా వినతిపత్రాలు అందజేశారు. దీనిలో భాగంగా దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణ రెడ్డి, రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌లను కలిసి 22(ఎ) (1)(సి) రిజిస్ట్రేషన్ చట్టం నుంచి కోరు కొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూములపై ఉన్న నిషేధ ఉత్తర్వు లను తొలగించాలని కోరారు. అలాగే రంగనాథస్వామి ఆలయ రాజగోపురం పునర్నిర్మాణం, నరసింహస్వామి ఆలయాభివృద్ధి, టీటీడీ నూతన కల్యాణ మండపం మంజూరు, శ్రీవాణి ఆలయాల చెల్లింపుల వివరాలు, రానున్న పుష్కరాలకు టెంపుల్ టూరిజం డెవలప్‌మెంట్‌పై చర్చించారు. కణుపూరు కొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి, శివపార్వతుల విగ్రహం ఏర్పాటుపై చర్చించి త్వరగా పూర్తి చేయాలని కోరారు.



దేవదాయశాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

అలాగే హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి సీతానగరం మండలం మునికూడలి, బొబ్బిలంక, పురుషోత్తపట్నంలో గోదావరి ఎడమ వరద ఒడ్డు తరచూ కోతకు గురవుతోందని, నిధులు మంజూరు చేసి అంచును పటిష్ట పర్చాలని కోరారు. బొబ్బిల్లంక-పురుషోత్తపట్నంలోని ఏజీఎల్‌బీ బండ్‌పై బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే వాసు



50వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 27: డివిజన్లలో సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 50వ డివిజన్ పరిధి భాస్కరనగర్, సుబ్రహ్మణ్యనగర్, చౌడేశ్వరి నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. డ్రైనేజీలు, రహదారులను పరిశీలించారు. అవసరమైన చోట్లలో డ్రైనేజీలు, రోడ్లు, కల్వర్టులు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ గత పాలకులు కమీషన్లకు ప్రాధాన్యమిచ్చారని.. తాము అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ప్రాముఖ్యత ఇస్తున్నామన్నారు. డివిజన్ శివారు ప్రాంతంలో కొంతమంది ఆకతాయిలు రాత్రివేళల్లో గంజాయి తాగి ఇబ్బంది పెడుతున్నారని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించి రాత్రి గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, మరుకుర్తి రవియాదవ్, బుడ్డిగ రాధ, హరిబెనర్జి, నగరపాలక సంస్థ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారులకు అభినందన

విజయవాడలో ఇటీవల జరిగిన యంగ్ స్టార్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024లో విజేతలుగా నిలిచిన బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు అభినందించారు. తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఉదయం అండర్-9, 11, 13, 15, 17, 19 విభాగాల్లో విజయం సాధించిన క్రీడాకారులు వారి సాధించిన ట్రోఫీలతో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్ విజయన్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

బావమరిదిపై బావ కత్తితో దాడి

తీవ్ర గాయాలు.. కాకినాడ జీజీహెచ్‌కు తరలింపు

అనపర్తి, ఆగస్టు 27: మండలంలోని రామవరంలో బావమరిదిపై బావ కత్తితో దాడి పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీనునాయక్, బాధితుడి బంధువుల వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన తాతపూడి విజయ్‌కుమార్‌కు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన వీరమ్మతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం రామవరంలో జరిగే ఒక వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన వీరమ్మ అన్నయ్య ఖండవిల్లి ఆనంద్ చెల్లిని చూసేందుకు మంగళవారం సాయంత్రం వచ్చాడు. ఈ సందర్భంగా ఇంట్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను ఆనంద్ ప్రస్తావించడంతో బావబామ్మర్దుల మధ్య వివాదం తలెత్తింది. కోపోద్రిక్తుడైన విజయ్ కుమార్.. ఆనంద్‌ను కత్తితో తలపై నరకడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. వెంటనే బంధువులు అతడిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై ఆనంద్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



గాయాలపాలైన ఆనంద్

మగ్గం వర్క్‌తో మహిళలకు ఆర్థిక చేయూత

రాజానగరం, ఆగస్టు 27: మగ్గం వర్కుతో మహిళలకు ఆర్థిక చేయూత చేకూరుతుందని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. కిర్లంపూడి మండలం బూరుగుపూడిలోని మహిళలకు మగ్గం వర్కుపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఈశిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికి 4 వేలు మందికిపైగా మహిళలు శిక్షణ పొంది ఆదాయం పొందుతున్నారన్నారు. అల్లంపల్లి దుర్గ శిక్షకురాలిగా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, సుంకర వీరాస్వామి మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

బిక్కవోలు, ఆగస్టు 27: గ్రామంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆలయంలో శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటు చేసి అర్చకులు రాఘవరామ్ ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్థులు వివిధ రకాల స్వీట్లు, పిండి వంటలు కానుకగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

మొక్కు చెల్లించుకున్న కూటమి నాయకులు

బిక్కవోలు, ఆగస్టు 27: అనపర్తి ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గెలుపొందితే తిరుపతి వేంకటేశ్వరస్వామికి తలనీలాలు సమర్పించుకున్నామని పందలపాకకు చెందిన కూటమి నాయకులు మొక్కుకున్నారు. దీంతో వారు మంగళవారం తిరుమల వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పడాల వెంకటరామారెడ్డి, గుణ్ణం శ్రీనివాసచౌదరి, సబ్బెళ్ల విజయభాస్కరరెడ్డి, సబ్బారపు సూర్యనారాయణ, అనుసూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు అనుమతి తప్పనిసరి

రంగంపేట, ఆగస్టు 27: వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో పబ్లిక్ ప్రదేశాలలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు పంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ తోట కృష్ణసాయి మంగళవారం తెలిపారు. నవరాత్రులకు గణేష్ ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, విగ్రహాల ఎత్తు ఐదడుగులకు మించరాదని, ప్రజలు ఎవ్వరూ ఇబ్బంది పడకుండా సౌండ్ పెట్టాలని, రాత్రి 10 గంటల తరువాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. విద్యుత్ కనెక్షన్‌కు ఆశాఖాధికారుల అనుమతులు పొందాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో అల్లర్లకు, ఘర్షణలకు తావివ్వకుండా గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఎస్ఐ చెప్పారు.

వచ్చే నెల 1నుంచి రెవెన్యూ సదస్సులు

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, ఆగస్టు 27: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 1నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో భూ వివాదాలపై ప్రతి గ్రామంలోను, సభలు నిర్వహించి భూ ఆక్రమణలు, 22ఏ భూముల ఆక్రమణ, అన్ని రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రతి గ్రామంలో తహశీల్దార్‌తోపాటు ఏడుగురు అధికారులు సదస్సులో పాల్గొంటారన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ దోపిడీ, రికార్డుల తారుమారు, అడంగళ్ లోపాలు, ఏ1 రిజిస్టర్‌లోని లోపాలు, ఈనం, జిరాతీ భూముల అవకతవకలు, ఆన్‌లైన్ ట్యాపరింగ్, సరిహద్దు వివరాలు తదితర భూ సమస్యలను ఈ సదస్సులో పరిష్కరించుకోచ్చని ఎమ్మెల్యే చెప్పారు.

జయమణికి జాతీయ సేవా పురస్కారం



జయమణిని సత్కరిస్తున్న మదర్ థెరిస్సా సొసైటీ ప్రతినిధులు

రంగంపేట, ఆగస్టు 27: రంగంపేట పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కటికతల జయమణిని మదర్ థెరిస్సా సొసైటీ బీఆర్ అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కారంతో సత్కరించింది. ఈ మేరకు ఆమె స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విశిష్ట సేవలందిస్తున్న వారిని ఈ అవార్డులకు ఎంపిక చేసి మంగళవారం విజయవాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కారం సత్కరించారని, పురస్కారంలో పొందిన వారిలో తాను కూడా ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జయమణిని పలువురు అభినందించారు.